

ఆరంభ వేడుకలకు
## చెపాక్ స్టేడియం ముస్తాబు
- బాలీవుడ్ స్టార్స్ రాక..
- రేపటినుంచి ఐపిఎల్ సీజన్-17 టోర్నమెంట్

6

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
# ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 226 | విజయవాడ, గురువారం 21 మార్చి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 21 March 2024 | Rs

## మే 16 నుంచి ఇఏపిసెట్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఏపిసెట్) మే 16 నుంచి జరగనుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి వై నజీర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విద్యార్థులకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు 18, 19, 20, 21, 22 తేదీల్లో పరీక్ష ఉంటుందని వెల్లడించారు. పిజిసెట్ జూన్ 10 నుంచి 14 వరకు జరుగుతాయని ప్రకటించారు. మే 2 నుంచి 5 వరకు ఆర్ సెట్ కూడా ఉంటుందని వెల్లడించారు.

# విద్వేష జాడ్యం

## ఎన్నికల వేళ బరితెగిస్తున్న బిజెపి నేతలు



అస్సాం బోడోల్యాండ్ వర్శిటీలో ప్రదర్శించిన ర్యాలీలో ముస్లింలను నేరస్థులుగా ఊరేగిస్తున్న దృశ్యం



కేంద్ర సహాయ మంత్రి శోభా కరండ్లాజె

**న్యూఢిల్లీ :** ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ బిజెపి విద్వేష, విచ్ఛిన్నకర రాజకీయాలను ముమ్మరం చేస్తోంది. ప్రధాన మంత్రి దగ్గర నుండి గల్లీ నాయకుడి దాకా ఇదే పనిలో ఉన్నారు. మతం పేరుతోనో, ప్రాంతం పేరుతోనో, భాష పేరుతోనో విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలికలు సృష్టించేందుకు బాహాటంగానే యత్నిస్తున్నారు. కేంద్ర సహాయ మంత్రి శోభా కరండ్లాజె కర్ణాటక, తమిళనాడు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపాయి. మరో వైపు అస్సాంలో ఇవే శక్తులు ప్రశాంతంగా ఉన్న యూనివర్సిటీల్లో మత విద్వేషాగ్నిని రాజేసేందుకు యత్నించాయి.

ప్రధాని మోడీ దగ్గర శిష్యరికం పొందిన కేంద్ర సహాయ మంత్రి శోభా కరండ్లాజె ఇటీవల బెంగళూరులో చేసిన వ్యాఖ్యలు ప్రశాంతంగా ఉన్న తమిళనాడు, కర్ణాటక మధ్య చిచ్చు పెట్టేవిగా ఉన్నాయి. ఇటీవల ఓ నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఈ నెల 1న బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుడు ఘటనకు తమిళనాడు ప్రజలే కారణమని ఆరోపించారు. తమిళనాడులో శిక్షణ పొంది ఇక్కడ బాంబులు వేస్తారు అని ఆరోపించారు. ఈ పేలుడు కేసుపై విచారణ జరుగుతున్న సమయంలో సాక్షాత్తూ కేంద్ర మంత్రి ఒకరు ఈ విధమైన చౌకబారు వ్యాఖ్యలు చేయడంపై ఇరు రాష్ట్రాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. బిజెపి నాయకుల విద్వేష రాజకీయాలకు ఇదో మచ్చుతునక అని విమర్శించారు. కేంద్రమంత్రి విద్వేషపూరిత వ్యాఖ్యలను తమిళులు, కన్నడిగులు తిరస్కరిస్తారని డిఎంకె పేర్కొంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన కరండ్లాజెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిఎంకె డిమాండ్ చేసింది. మదురై సిటీ పోలీస్‌స్టేషన్‌లో కేంద్ర మంత్రిపై కేసు కూడా నమోదయింది. 'భాషా ప్రాతిపదికన రెండు ప్రాంతాల ప్రజల మధ్య శత్రుత్వాన్ని పెంచుతున్నారు' అని మంత్రిపై ఎఫ్ఐఆర్‌లో పోలీసులు అభియోగం మోపారు. కడచానెంతల్‌కు చెందిన సి.త్యాగరాజన్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు మంత్రిపై ఈ కేసు నమోదు చేశారు. ఐపిసిలో 153, 153ఎ, 505(1), 505 (2) సెక్షన్ల కింద కేసు నమోదయింది..

### ముస్లింలను క్రిమినల్స్‌గా చిత్రించిన అస్సాం యూనివర్శిటీ

బిజెపి పాలనలో ఉన్న అస్సాంలోని ఒక యూనివర్శిటీ ముస్లింలను క్రిమినల్స్‌గా చిత్రించారు. దీనిపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని బోడోలాండ్ యూనివర్శిటీలో ఈ నెల 16న ఒక సాంస్కృతిక కార్యాక్రమం నిర్వహించారు. యూనివర్శిటీ 23వ వారోత్సవాల సందర్భంగా యూనివర్శిటీ భౌగోళిక విభాగం 'మనం, మన సమాజం' పేరుతో ఒక సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించింది. ఇందులో ఇద్దరు క్రిమినల్స్ పాత్రదారులకు ముస్లిం మతస్థుల వేషధారణ వేశారు. వీరిని ఒక పోలీసు కొడుతూ ఉన్న దృశ్యాన్ని ప్రదర్శించారు. ముస్లింలను అభ్యంతరకరంగా చిత్రీకరించడంపై నిరసనలు వ్యక్తమయ్యాయి. అల్ బోడోలాండ్ టెరిటోరియల్ రీజన్ మైనార్టీ స్టూడెంట్స్ యూనియన్ (ఎబిటిఆర్ ఎంఎస్‌యు) ప్రతినిధులు, అల్ అస్సాం మైనార్టీ స్టూడెంట్స్ యూనియన్ (ఎఎంఎస్) ప్రతినిధులు యూనివర్శిటీ వైఎస్ ఛాన్సలర్ బాబులాల్ అహుజాను కలిసి తమ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వైస్ ఛాన్సలర్ వారికి క్షమాపణలు చెప్పారు. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ఉన్న అస్సాంలో ముస్లిం అణచివేత చర్యలు తీవ్రంగా సాగుతున్న సంగతి తెలిసిందే.



## ఎన్నికల సంఘమే స్పందించాలి

- వలంటీర్ల వ్యవస్థపై హైకోర్టు

**ప్రజాశక్తి-అమరావతి**

వలంటీర్ల వ్యవస్థపై కేంద్ర ఎన్నికల సంఘమే స్పందించాలని హైకోర్టు పేర్కొంది. వలంటీర్ల విషయంలో మధ్యంతర ఆదేశాలివ్వలేమని తేల్చి చెప్పింది. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా గతంలోనే ఇసికి ఉత్తర్వులు జారీ చేశామని గుర్తు చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రంతోపాటు ఇసికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 3 నెలలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలిచ్చింది. వైసిపికి చెందిన 2.57 లక్షల మంది కార్యకర్తలను గ్రామ, వార్డు వలంటీర్లుగా నియమించారని, వీరి నియామకం చట్ట వ్యతిరేకమని, వీరిని ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా ఉత్తర్వులు జారీ చేయాలంటూ కడప జిల్లా, రాజంపేటకు చెందిన షేక్ అబూబాకర్ సిద్దిఖీ పిల్ దాఖలు చేశారు. అధికార వైసిపి వారే వలంటీర్లుగా ఉన్నారని సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదించారు. 'వలంటీర్ల వల్ల ప్రజలకు మేలు జరుగుతోంది కదా' అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

# ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకం

- సానుకూల దిశలో 'ఇండియా' సీట్ల సర్దుబాటు చర్చలు
- పదేళ్లుగా రాజ్యాంగ విలువలపై దాడి
- బిజెపి ఆర్థిక విధానాలతో ప్రజల జీవితాలు ధ్వంసం
- సేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే బిజెపి ఇంటికే
- పిటిఐ ఇంటర్వ్యూలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి



**ప్రతిపక్షాలతో కూడిన ఇండియా బ్లాక్‌కు ప్రజాదరణ అంతకంతకూ పెరుగుతోందని, అయితే ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించేదానిపైనే అంతా ఆధారపడి ఉంటుందని సిపిఐ(ఎం) నేత సీతారాం ఏచూరి చెప్పారు.**

**న్యూఢిల్లీ :** రాబోయే సార్వత్రిక ఎన్నికలు భారత ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమైనవని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. దేశ లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని కాపాడుకుంటామా లేదా అనే విషయాన్ని ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయని పిటిఐ వార్తాసంస్థకు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏచూరి పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా రాజ్యాంగ విలువలపైన, మన రాజ్యాంగ మూల స్తంభాలపైన ఎడాపెడా దాడులు జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగ మూల స్తంభాల్లో ఒకటి లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజం అనేవి ఇతర మూల స్తంభాలు అని ఆయన వివరించారు.

' మనం భారత గణతంత్ర రిపబ్లిక్ లక్షణాలైన లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని కాపాడుకుంటామా లేక అవి మరింత హరించుకుపోయేందుకు అనుమతిస్తామా అనే విషయాన్ని ఈ ఎన్నికలు నిర్ణయించబోతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని' ఆయన అన్నారు.

### ప్రజా హక్కుల పరిరక్షణే ఇండియా బ్లాక్ లక్ష్యం

రాజ్యాంగాన్ని, మన రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రజాస్వామ్యాన్ని, పౌర స్వేచ్ఛను, ప్రజల హక్కులను కాపాడడం, వాటిని మరింత బలోపేతం చేయాలన్న సంకల్పంతోనే ఇండియా బ్లాక్ ఏర్పడింది. రాజ్యాంగం హామీ ఇచ్చిన మరో అత్యంత ముఖ్యమైన అంశం సమానత్వం, సామాజిక న్యాయం.వీటికి కట్టుబడి ఉంటామని ఫోరమ్‌లోని భాగస్వామ్య పక్షాలు ముందుకు వచ్చాయి' అని ఆయన వివరించారు.

### విలువలే ప్రధానం

ఇండియా వేదికలో 40 ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయి. గత సంవత్సరం జూన్ 18న పాట్నాలో జరిగిన ప్రతిపక్ష పార్టీల సమావేశంలో ఇండియా బ్లాక్ ఆవిర్భవించింది. అయితే ఆ తర్వాత బీహార్‌లో జెడియు, ఉత్తరప్రదేశ్‌లో ఆర్ఎల్‌డి పార్టీలు కూటమి నుండి నిష్క్రమించాయి. సీట్ల సర్దుబాటులో జాప్యం కారణంగా కూటమికి ఎదురు దెబ్బలు తగిలాయి. దీనిపై ఏచూరి స్పందిస్తూ సీట్ల సర్దుబాటుపై సానుకూల దిశగా చర్చలు మిగతా 5లో



శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్‌పేటలో నీట మునిగిన మొక్క జొన్న పంట

# అకాల వర్షంతో అవస్థలు

- శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో మొక్కజొన్నకు నష్టం
- ఏలూరులో పిడుగుపాటుకు ఒకరు మృతి

**ప్రజాశక్తి- యంత్రాంగం**

ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం వర్షాలు కురిశాయి. ఏలూరు జిల్లాలో పిడుగుపాటుకు ఒకరు మృతి చెందారు. అకాల వర్షాలతో మొక్కజొన్నకు శ్రీకాకుళం జిల్లాలో భారీగా, విజయనగరం జిల్లాలో స్వల్పంగా నష్టం వాటిల్లింది. పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో వడగండ్ల వాన కురిసింది. మామిడి కాయలు నేలరాలాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అక్కడక్కడా జల్లులు పడ్డాయి. వర్షం వస్తుండటంతో గడ్డివాము తడవ కూడా పరదా కప్పడానికి వెళ్లిన ఏలూరు శివార్లలోని చొదిమెళ్ల గ్రామానికి చెందిన రావూరి సత్యనారాయణ (45) పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి మిగతా 5లో

## ప్రముఖ విద్యావేత్త కెవి రత్నం కన్నుమూత

- నేడు అంత్యక్రియలు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**



ప్రముఖ విద్యావేత్త, రాష్ట్రంలో ప్రయివేటు కోచింగ్ సెంటర్లకు ఆద్యుడు కెవి రత్నం (85) బుధవారం కన్నుమూశారు. కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన నెల్లూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రస్తుతం వారు రత్నం విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. కెవి రత్నం అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ముత్తుకూరు గేట్ వద్ద ఆయన అతిథి గృహం నుంచి అంతిమయాత్ర ప్రారంభం కానుంది. పిడితాపోలూరు వద్ద రత్నం విద్యా సంస్థలకు దగ్గరలోగల ఆయనకు చెందిన పొలాల్లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కెవి రత్నం భార్య గతంలోనే మృతి చెందారు.

# ఇసి ఆదేశాల మేరకే డిఎస్‌సి

## సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదులు చేయండి • సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే డిఎస్‌సి నిర్వహణపై తుదినిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. బరాష్ట్ర సచివాలయంలోని ఎలక్షన్ మీడియా సెంటర్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిఎస్‌సిని వాయిదా వేయాలని కోరుతూ అనేక వినతులు అందుతున్నట్లు చెప్పారు. దీంతో ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. అక్కడ నుండి వచ్చే ఆదేశాల మేరకే డిఎస్‌సిని నిర్వహించాలా..వాయిదా వేయాలా అన్న అంశంపై నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయాలని ఆయన సూచించారు. ఈ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, వాలంటీర్లు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్‌ను విధించినట్లు తెలిపారు. ఎటువంటి కార్యక్రమం అయినా అనుమతులు తీసుకోవాల్సిందేనని అన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. కోడ్ వచ్చిన ఈ నెల 16 నుండి ఇప్పటిదాకా వలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు కలిపి 46 మందిని విధుల నుండి తొలగించామని తెలిపారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, వలంటీర్లు అయితే విధుల నుండి తొలగిస్తామని, రెగ్యులర్ ఉద్యోగులు అయితే సస్పెండ్ చేస్తామని చెప్పారు. ప్రధాని కార్యక్రమంలో భద్రతా లోపాలపై ఫిర్యాదు అందిందని, కేంద్రానికి నివేదించామని అన్నారు. ప్రభుత్వ భవనాలపై నేతల ఫొటోలు, ప్రకటనలు తొలగించాలని ఆదేశించామని చెప్పారు. ఇప్పటి దాకా 1.99 లక్షల పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగించామన్నారు. అలాగే 385 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. రాష్ట్రంలో 173 బృందాలు ఎన్నికల విధులను పర్యవేక్షణ చేస్తున్నాయని తెలిపారు. మూడు రోజుల పరిధిలో రూ 3.39 కోట్ల నగదును స్వాదీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. సినిమా టీజర్‌లో పవన్ కల్యాణ్ గాజు గ్లాసు చూపించిన అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. రాజకీయ హింస లేకుండా ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గిద్దలూరు, ఆళ్లగడ్డలో రాజకీయ హత్యలు, మాచర్లలో హింసాత్మక ఘటనలు జరిగాయని ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల ఎస్‌పిలను పిలిపించి మాట్లాడుతామని తెలిపారు. ఎస్‌పిల నివేదిక నివేదిక చూశాక చర్యలు తీసుకుంటామన్నారు. . సమావేశంలో అడిషనల్ సిఇఒలు కోటేశ్వరరావు, హరీంద్ర ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## డిఎస్‌సి వాయిదా వేయాలి

- సిఎస్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ
- ఎన్నికల అనంతరం మెగా డిఎస్‌సి నిర్వహించాలి

2

గిరిపుత్ర

# దీని భావమేమి..!

**గుం**టూరు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో జరిగిన ప్రజాగళం సభలో ప్రత్యేకహోదా, విభజన హామీలు, పోలవరం, విశాఖ ఉక్కు తదితర కీలక సమస్యలను ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగంలో విస్మరించడంతో పాటు రాష్ట్రంలో అధికార పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పైన గానీ దాని అధినేత జగన్‌మోహన్ రెడ్డి పైన గానీ ఆయన ప్రత్యక్ష విమర్శలు చేయకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. సభ జరిగిన తీరు, అక్కడ ప్రస్తావించిన అంశాలపై ప్రతిస్పందించిన వైసిపి అధికార ప్రతినిధులు టిడిపి, జనసేనలపై విరుచుకుపడ్డారే తప్ప బిజెపి గురించి మౌనంగా ఉండడం ఆ సందేహాలకు బలం చేకూరుస్తోంది. మరోవైపు ఈ రాష్ట్రంలో ప్రధాన శక్తిగా లేని కాంగ్రెస్‌పై ప్రధాని విమర్శలు ఎక్కుపెట్టడం చూస్తే ఇండియా వేదికపట్ల ఆయన ఎంత కలవరపాటుకు గురవుతున్నారో బోధపడుతుంది. కాంగ్రెస్‌పై విమర్శలు ఇక్కడి అధికార పార్టీకి సంతసం కలిగించేవి కావడం గమనార్హం.

ముఖ్యమైన సమస్యలను విస్మరించిన ప్రధాని 'వికసిత్ ఆంధ్రప్రదేశ్' తమ లక్ష్యమని చెప్పారు కానీ ఏం చేసి లేదా రాష్ట్రానికి ఏమిచ్చి దాన్ని సాధిస్తారో వివరించలేదు. సిఎం జగన్ నవరత్నాలు వల్లెవేసినట్లు పిఎం మోడీ కేంద్ర పథకాలను వల్లెవేశారు. తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన మోడీ రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం అధికారంలో ఉందని, దానికి చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రులు అవినీతిలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారని అన్నారేతప్ప ముఖ్యమంత్రి అని కానీ లేదా జగన్‌మోహన్‌రెడ్డి పేరు కానీ ఆ సందర్భంలో ప్రస్తావించలేదు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్‌సిపి, కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదని, రెండూ ఒకే కుటుంబం చేతిలో ఉన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఇండియా బ్లాక్‌లో పార్టీలు ఎవరికి వారుగా వ్యవహరిస్తుంటారని రాష్ట్రాలవారీగా ఒక దండకం వినిపించారు.

అదే రోజున స్పందించిన రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) చంద్రబాబును, పవన్ కల్యాణ్‌ను తీవ్రంగా విమర్శించారేతప్ప అవినీతి ఆరోపణలు చేసిన మోడీని పల్లెత్తు మాట అనలేదు. అంతేగాక 'పగలు మీతో, రాత్రి రాహుల్ గాంధీతో చేతులు కలిపే చంద్రబాబుతో జాగ్రత్తగా ఉండాలని' మోడీకి హితవు పలకడం దేన్ని సూచిస్తుంది? గడచిన ఐదేళ్లలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడం, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బిల్లులకు దాదాపు అన్నిటికీ చేతులెత్తిన తమ పార్టీనే విశ్వసించమని ఆయన బతిమాలినట్టు భావించవచ్చు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా వైఎస్ఆర్‌సిపి గురించి మాట్లాడుతూ మూడు తప్ప అన్ని బిల్లులకూ వారు మద్దతునిచ్చారని చెప్పిన విషయం పాఠకులకు గుర్తుండే వుంటుంది. కనుక ఇదొక రూపంలో క్విడ్‌ప్రోకో లాంటిదే!

'విజయవాడలో 40 దేవాలయాలను కూల్చి, చెత్తకుప్పలో పడేసిన చంద్రబాబు పక్కన కూర్చుంటే ప్రధాని మోడీని హిందువులు ఎలా నమ్ముతారని' పేర్ని నాని ప్రశ్నించారు. రోజూ నా ఎస్సీ ఎస్టీలు, నా మైనార్టీలు అంటూ దీర్ఘాలు తీసే వైఎస్ఆర్‌సిపి మతతత్వ ధోరణులు రెచ్చగొట్టే ప్రధానిని ఎదుర్కోవడం మానేసి తాము బిజెపి కంటె మించిన మతవాదులమని నమ్మించేందుకు యత్నించడమే కదా! ఈ విధంగా మెజార్టీ మతతత్వం విషయంలో కాషాయదళంతో సమ ఉజ్జీగా లేదా మరింత తీవ్రంగా ఉంటామని ప్రధానికి, బిజెపికి సంకేతం ఇవ్వడమే అవుతుంది. సిఎఎ అంశంపైనా వైఎస్ఆర్‌సిపి సర్కారు కేంద్ర ప్రభుత్వ విధానాన్ని గట్టిగా బలపరుస్తూనే ఉంది. పొరుగునవున్న తమిళనాడు, కేరళ వంటి ప్రభుత్వాలు సిఎఎను అమలు చేయబోమని నిర్ద్వంద్వంగా ప్రకటించినా జగన్ ప్రభుత్వం కిమ్మనకపోవడం అందులో భాగమే. టిడిపి అధినేత చంద్రబాబు దాన్ని సమర్థిస్తూ ఇప్పటికే మాట్లాడారు.

ప్రజాగళం సభపై మంగళవారంనాడు స్పందించిన అధికారపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రధాని మోడీని విమర్శిస్తూ ఒక్కటంటే ఒక్క వాక్యం కూడా చెప్పలేదు. నిజానికి ఆనాటి సభలో ప్రధాన వక్త ప్రధాని మోడీ కాగా సుదీర్ఘమైన ఆ స్పందనలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపైనే సజ్జల విమర్శలు ఎక్కుపెట్టారు. సిఎం జగన్ ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం వగైరాల గురించి కోరారనీ, చంద్రబాబు, పవన్ చిలకలూరిపేట సభలో కనీసం అడగలేదని అన్నారేతప్ప వాటిని మంజూరు చేయని ప్రధాని గురించి ప్రస్తావించకపోవడం ఎవరిని రక్షించడానికి? 'ప్రధాని మోడీకి సన్మానం అన్నారు. అవమానించారు.' అని సజ్జల చెప్పడం ఎవరిని ప్రసన్నం చేసుకోవడానికి? ఏతావాతా పరిశీలిస్తే బిజెపి- వైసిపిల మధ్య కొన్నేళ్లుగా సాగుతున్న పరస్పర సహకారం ఇప్పటికీ కొనసాగుతోందన్నది స్పష్టం. అందుకే మోడీ ముఖ్యమంత్రిని విమర్శించలేదు... వైసిపి వారు ప్రధానిని ఏమీ అనలేదు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడబలుక్కునే కార్పొరేట్లకు సేవ చేస్తున్నాయి. అదానీకి పోర్టులు, రాష్ట్ర సంపదను అప్పగించడం, నత్వానీకి పదవులు కట్టబెట్టడం వంటివి కళ్లకు కనిపించే సాక్ష్యాలు కాగా తెరవెనుక వ్యవహారాలెన్నో!

శ్రమదోపిడీతో వ్యాపార సంస్థలకు
# ఏడాదికి రూ.2.7 లక్షల కోట్లు

- ఐఎల్‌ఒ నివేదిక

**న్యూఢిల్లీ :** నిర్బంధ కార్మికుల శ్రమ దోపిడీ ద్వారా వివిధ వ్యాపార సంస్థలు ఏడాదికి 36 బిలియన్ డాలర్ల (2.7 లక్షల కోట్లు) అక్రమ లాభాలను ఆర్జిస్తున్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ) తెలిపింది. ఈ మేరకు జెనీవాలో ఐఎల్‌ఒ ఒక నివేదికను విడుదల చేసింది. 2014 నుండి ఈ అక్రమ లాభాలు 37 శాతం పెరిగాయని నివేదక స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో ఏడాదికి నిర్బంధ కార్మికుల సంఖ్య పెరుగుతోందని, మరోవైపు శ్రమ దోపిడీ ద్వారా వ్యాపార సంస్థలు ఆర్జిస్తున్న లాభాలు కూడా అధికమవుతున్నాయని పేర్కొంది.

2021లో 27.6 మిలియన్ల మంది నిర్బంధపు కార్మికులుగా మారారని నివేదిక పేర్కొంది. అంటే ప్రపంచంలోని ప్రతి వెయ్యిమందికి 3.5 మంది కార్మికులుగా మారుతున్నారు. 2016 -2021 మధ్య నిర్బంధకార్మికుల సంఖ్య 2.7 మిలియన్లు పెరిగిందని తెలిపింది.

'ప్రాఫిట్స్ అండ్ ప్రాపర్టీ : ది ఎకనామిక్స్ ఆఫ్ ఫోర్స్‌డ్ లేబర్ ' పేరుతో భారత్‌తో పాటు సౌదీ అరేబియా, ఖతార్ దేశాలలోని కార్మికులపై ఈ సర్వే చేపట్టింది. మానవ అక్రమ రవాణా దారులు, నేరస్థులు బాధితుని నుండి 10,000 డాలర్లు సంపాదిస్తున్నారని అంచనా వేసింది. దశాబ్దం క్రితం ఈ సంపాదన ( అప్పటి ద్రవ్యోల్బణంతో సరిపోలిస్తే ) 8,269 డాలర్లుగా ఉండేదని తెలిపింది.

నిర్బంధ కార్మికుల నుండి వచ్చే మొత్తం వార్షిక అక్రమ లాభాలు యూరప్, మధ్య ఆసియా దేశాల్లోనే (84 బిలియన్ డాలర్లు) అధికంగా ఉందని నివేదిక తెలిపింది. ఆసియా, పసిఫిక్ దేశాల్లో (62 బిలియన్ డాలర్లు), అమెరికాలో (52 బిలియన్ డాలర్లు), ఆఫ్రికా (20 బిలియన్ డాలర్లు), అరేబియా దేశాల్లో (18 బిలియన్ డాలర్లు)గా ఉన్నట్లు పేర్కొంది.

## ఐక్య పోరాటాలతోనే విజయం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ




ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)
ఐక్య పోరాటాలతోనే విజయం సాధ్యమవుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాటికి 1133వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగం కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొడతామన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో బిజెపిని గద్దె దింపి ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవాలని కోరారు. ఈ రెండు నెలల్లో ఉక్కు పోరాటాన్ని మరింత ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని తెలిపారు.

## యథావిధిగా పాలిసెట్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పాలిసెట్-2024 పరీక్ష ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం యథావిధిగా ఏప్రిల్ 27న ఉంటుందని సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సిహెచ్ నాగరాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం apsbtet.ap.gov.in, sbtet.ap.gov.in వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు. పాలిటెక్నిక్ (సి20), 4, 5 సెమిస్టర్ల సాధారణ పరీక్షలు ఏప్రిల్ 18 నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను అనుసరించి అన్ని పరీక్షలు అదే తేదీన ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు ఈ నెల 26వ తేది వరకు చెల్లించవచ్చునని వెల్లడించారు. సి23 మొదటి సంవత్సరం పరీక్షలు మే 2 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## లారీ కింద పడి ఇద్దరు మహిళా కార్మికుల దుర్మరణం

- లలిత రైసుమిల్లులో ఘటన

ప్రజాశక్తి- పెద్దాపురం(కాకినాడ జిల్లా)
లారీకింద పడి ఇద్దరు మహిళా కార్మికులు దుర్మరణం చెందిన ఘటన కాకినాడ జిల్లా పెద్దాపురంలోని లలిత రైస్ మిల్లులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దాపురం పట్టణానికి చెందిన కామిశెట్టి కామేశ్వరి (51), కట్టమూరుకు చెందిన మోతుపల్లి నాగరత్నం (65) పెద్దాపురం-వాలుతిమ్మాపురం రహదారిలో ఉన్న లలిత రైస్ మిల్లులో పనిచేస్తున్నారు. ఎప్పటిలానే బుధవారం రైసుమిల్లు ప్రాంగణంలో పనిచేసుకుంటు న్నారు. అదే సమయంలో లారీ డ్రైవర్ లారీ రివర్స్ చేశారు. లారీ అదుపుతప్పి మహిళలపైకి దూసుకెళ్లింది. దీంతో కామేశ్వరి, నాగరత్నం తీవ్రంగా గాయపడ్డారు. యాజమాన్యం వారిని పెద్దాపురం ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే వారు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించామని ఎస్ఐ వి సురేష్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## పవన్‌తో వరప్రసాద్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో రాజోలు నియోజకవర్గ నాయకులు, మాజీ ఐఎఎస్ అధికారి దేవీ వరప్రసాద్ భేటీ అయ్యారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌ను ఆయన బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా అనుసరించాల్సిన విధి విధానాలను పవన్‌కల్యాణ్ వివరించారు. గత ఎన్నికల్లో జనసేనను గెలిపించిన రాజోలు నియోజకవర్గ ఓటర్లు నాడు చూపించిన ఆదరణను నేడు మరింత చూపాలని పిలుపునిచ్చారు. వారు తమపై ఉంచిన విశ్వాసాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ నిలబెట్టుకుంటామన్నారు. అనంతరం నామినేషన్ దాఖలుకు సంబంధించిన నియమావళి, నిబంధనలతో కూడిన పత్రాలను వరప్రసాద్‌కు అందజేశారు.

# ప్రతి ఒక్కరూ ఓటు వేయండి

- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ
- సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి



ప్రజాశక్తి- అమరావతి బ్యూరో
రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి కోరారు. రాష్ట్ర సచివాలయంలో ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాతో కలిసి రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్లు తెలిపారు. ఎన్నికల బందోబస్తు కోసం కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు తమిళనాడు, కేరళ, కర్నాటక పోలీసుల సహాయం తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 46,165 పోలింగ్ కేంద్రాలుండగా, అందులో కనీసం 50శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. వెబ్ కాస్టింగ్ ఉన్న పోలింగ్ కేంద్రాలను నేరుగా కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమై ఉంటాయని చెప్పారు. జనవరి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.78కోట్ల నగదు, రూ.41కోట్ల విలువైనవస్తువులు, రూ.30కోట్ల విలువైన వివిధ డ్రగ్స్ వంటి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన గత నాలుగు రోజుల్లోనూ వివిధ మోడల్‌కోడ్ తనిఖీ బృందాల ద్వారా రూ.3.39కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రాష్ట్ర సరిహద్దులు, ఇతర ప్రాంతాల్లో 60 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులుతో సహా మొత్తం 121 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో 85 ఏళ్లు నిండిన వృద్ధులు, వివిధ అంగవైకల్యం కలిగిన ఓటర్లు ఇంటి నుంచే వారి ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా 46,165 పోలింగ్ కేంద్రాలు

**ముఖేష్‌కుమార్ మీనా**

రాష్ట్రంలో 46,165 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సెక్యూరిటీ సిబ్బందికి 12,683 వాహనాలు, పోలింగ్ సిబ్బందికి 13,322 వాహనాలు అవసరం ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 175 మంది అసెంబ్లీ, 25 మంది పార్లమెంట్ రిటర్నింగ్ అధికారులు ,829మంది అసెంబ్లీ, 209 మంది పార్లమెంట్ ఎఆర్‌ఓలు, 5వేల67మంది సెక్టోరల్ పోలీస్ అధికారులు, 18,961మంది మైక్రో అబ్జర్వర్లు, 55,269 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,48,814మంది పోలింగ్ అధికారులు, 46,165మంది బూత్‌స్థాయి అధికారులు, 416 మంది జిల్లా స్థాయినోడల్ అధికారులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

**కేంద్ర, రాష్ట్ర బలగాలు: డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి**

ఎన్నికల నిర్వహణ బందోబస్తుకు 1.50లక్షల మంది రాష్ట్ర పోలీసులతో పాటు 522 కంపెనీల స్టేట్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు, 465 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో పాటు కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి హోమ్‌గార్డులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో హోమ్, పంచాయతీరాజ్, విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులు హరీష్‌కుమార్‌గుప్తా, శశిభూషణ్ కుమార్, ప్రవీణ్ ప్రకాష్, హోమ్‌శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ రవి ప్రకాష్, పాల్గొన్నారు.

## కర్నూలు అసెంబ్లీకి సిపిఎం పోటీ

- వామపక్ష అభ్యర్థులను గెలిపించండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర నాయకులు జగన్నాథం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్
కర్నూలు అసెంబ్లీ స్థానానికి సిపిఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర నాయకులు కె.జగన్నాథం వెల్లడించారు. కర్నూలు సుందరయ్య భవన్‌లో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సిపిఎం, సిపిఐ పరస్పర సహకారంతో ఎన్నికల్లో ముందుకెళ్లాలని అనుకున్నామని, కాంగ్రెస్‌తోనూ చర్చలు నడుస్తున్నాయని, త్వరలోనే అవి కూడా కొలిక్కి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా టిడిపి, జనసేన, పరోక్షంగా వైసిపి.. బిజెపిని మోసే పనిలో ఉన్నాయన్నారు. పదేళ్ల బిజెపి పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగిందని, మతాన్ని రాజకీయ స్వార్థానికి వినియోగిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. బిజెపిని ఓడించాలని వామపక్షాలుగా ప్రయత్నం చేస్తున్నామని, కలిసొచ్చే వాళ్లందరినీ కలుపుకుని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నిరంకుశంగా పాలన సాగిస్తున్న వైసిపిని, మతోన్మాద బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేనను ఓడించాలని, ప్రజా ఉద్యమాలకు మద్దతు తెలపాలని, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కె.జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపిని, దానికి మద్దతిస్తున్న పార్టీలను ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ఉద్యమాల కోసం పోరాటం చేసే వామపక్షాలను, కలిసే శక్తులను గెలిపించాలని కోరారు.

## గ్రూప్-1 మెయిన్స్ అప్పీల్‌పై నేడు విచారణ

ప్రజాశక్తి-అమరావతి
గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలంటూ ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది. డివిజన్ బెంచ్‌లోని న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ గుహనాథన్ నరేందర్ బుధవారం సెలవు పెట్టడంతో విచారణ వాయిదా పడింది.

**మరో పిల్ కొట్టివేత**

హైదరాబాద్‌ను మరో పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలంటూ దాఖలైన మరో పిల్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు కేంద్రం చట్టం చేసేలా ఉత్తర్వులు ఇవ్వలేమని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఎపి, తెలంగాణ ఆస్తి, అప్పుల విభజన జరగనందున హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగానే కొనసాగించేలా కేంద్రానికి ఉత్తర్వులు జారీ చేయాలంటూ నెల్లూరు జిల్లా, అక్కంపేటకు చెందిన నారపరెడ్డి కిరణ్‌కుమార్ వేసిన పిల్‌ను కొట్టేసింది. గతంలో ఇదే తరహా పిల్‌ను హైకోర్టు కొట్టేసిందని రాష్ట్రం గుర్తు చేసింది.

**డిఎస్‌సి నిలుపుదలకు నిరాకరణ**

టీచర్ పోస్టుల భర్తీకి చేపట్టిన డిఎస్‌సి ప్రక్రియ నిలుపుదలకు హైకోర్టు నిరాకరించింది. ఇది ప్రభుత్వ విధాన నిర్ణయమని చెప్పింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని వెల్లడించింది. హడావుడిగా పిటిషన్ దాఖలు చేసి మధ్యంతర ఆదేశాలు కోరితే ఎలాగని పిటిషనరును హైకోర్టు ప్రశ్నించింది. విచారణను మే ఒకటికి వాయిదా వేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత లున్న వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఒకే విధానం ఉండాలంటూ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ పిల్ దాఖ లు చేశారు. స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల నియామకానికి సంబంధించిన మార్గదర్శకాల జిఓ 11, అలాగే ప్రిన్సిపల్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుల మార్గదర్శకాల జిఓ 12ను రద్దు చేయాలని కోరారు.

**రాజధాని రైతులకు కౌలుపై పిల్**

అమరావతిలో రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లింపులకు సంబంధించిన సిఆర్‌డిఎ చట్ట నిబంధనలను సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. అమరావతి రైతులకు వార్షిక కౌలు చెల్లింపుల కోసం రూ.240 కోట్ల నగదు కేటాయిస్తూ 2023 మే 5న జిఓ 286 జారీ చేయడాన్ని విశాఖకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి యునైటెడ్ ఫ్రంట్ నార్త్ ఆంధ్రా జిల్లాల అధ్యక్షులు పాక సత్యనారాయణ సవాల్ చేశారు. ఈ పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది.

# సిఎఎపై భయం.. భయం

- మైనార్టీల్లో పెరుగుతున్న ఆందోళన




ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా అమలులోకి తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై మైనార్టీ ప్రజానీకంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి కుల, మతాలకు అతీతంగా ప్రజలందరిపైనా ఈ చట్ట ప్రభావం పడుతుంది. అయితే, బిజెపి అమలు చేసే విద్వేష విధానాల కారణంగా మైనార్టీ ప్రజానీకం ఎక్కువగా ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలో బిజెపికి పెద్దగా బలం లేనప్పటికీ, తెలుగుదేశం-జనసేనలు ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న సంగతి తెలిసిందే. కొంత కాలం వరకు లౌకిక విలువలకు పట్టం కట్టిన టిడిపి వాటిని విడిచిపెట్టి, బిజెపి అజెండాను భుజాన వేసుకున్నట్లైంది. దీనికి తగ్గట్టుగానే కొద్దిరోజుల క్రితం టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సిఎఎకు గట్టిగా వత్తాసు పలికిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని వ్యతిరేకించడమంటే రాజకీయం చేయడమేనని అన్న ఆయన 'ముస్లిం దేశాల్లో మనం ఉండగలమా?' అని కూడా ప్రశ్నించారు. బాబు చేసిన ఈ వ్యాఖ్యలపై చర్చ జరుగుతుండగానే చిలకలూరిపేట వద్ద ప్రధాని మోడీతో కలిసి నిర్వహించిన సభలో 'జెండాలు వేరైనా మా అజెండాలు ఒకటే' అని బాబు అన్నారు. ఈ సభలోనే ప్రసంగించిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ప్రకటించారు.

మోడీ డబుల్ ఇంజిన్ సరారు వస్తుందన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడటమంటే, సిఎఎతో పాటు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేసే అన్ని విధానాలను అమలు చేయడమే! అదే సమయంలో గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలోని డబుల్ ఇంజిన్ సర్కార్లు మైనార్టీలను ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటున్న తీరు, బుల్డోజర్ రాజ్ పేరుతో ఆస్తులను ధ్వంసం చేసి, రోడ్లమాద పడేస్తున్న తీరుపైనా ప్రస్తుతం ముస్లింలలో చర్చ సాగుతోంది. ఆందోళనలో ఉన్న మైనార్టీ ప్రజానీకానికి భరోసా ఇవ్వడానికి బదులుగా 'అజెండా ఒకటే' అని ప్రకటించడం ద్వారా టిడిపి, జనసేనలు వారికి దూరమవుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి సిఎఎ విషయంలో స్పష్టమైన వైఖరిని ప్రకటించకపోవడం కూడా మైనార్టీ ప్రజానీకంలో చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో వైసిపి వైపు మొగ్గు చూపిన మైనార్టీలు ఈ సారి డోలాయమానంలో ఉన్నారన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన బిజెపి జాతీయ నాయకుడు ఒకరు 'రాష్ట్రంలో ప్రత్యక్ష పొత్తులతో పాటు పరోక్ష పొత్తులుంటాయి' అంటూ చేసిన వ్యాఖ్యను పలువురు గుర్తు చేసుకుంటు న్నారు. అదే సమయంలో కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు సిఎఎను అమలు చేసేది లేదని స్పష్టంగా ప్రకటించాయి. జగన్ ప్రభుత్వం ఎందుకలా ప్రకటించడం లేదని ముస్లింలు ప్రత్యేకించి యువతీ యువకులు ఆందోళనగా ఉన్నారు. రాష్ట్రంలో కీలకమైన మూడు ప్రధాన రాజకీయ పార్టీలు భరోసా ఇవ్వడానికి బదులు బిజెపి పట్ల అనుసరిస్తున్న సానుకూల వైఖరి మైనార్టీల్లో ఆందోళనకు కారణమౌతోంది. సిఎఎ విషయంలో వామపక్షాలు అనుసరిస్తున్న వైఖరి కూడా మైనార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. మొదటి నుండి వామపక్షాలు సిఎఎను వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఆ పార్టీలు నిరసనలు, ఆందోళనలు చేశాయి. కనుక వారే తమకు అండదండగా నిలుస్తారన్న అభిప్రాయం మైనార్టీలలో వ్యక్తమవుతోంది.



## టిడిపి, వైసిపి కార్యకర్తల ఘర్షణ

- వలంటీర్లకు కానుకలు ఇస్తున్నారని టిడిపి ఆరోపణ
- కావాలని దాడికి వచ్చారని వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గంలోని వైసిపి కార్యాలయంలో వలంటీర్లకు కానుకల పంపిణీ తీవ్ర వివాదానికి దారితీసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా వైసిపి నేతలు వలంటీర్లకు కానుకలు ఇచ్చి ప్రలోభాలకు గురి చేస్తున్నారని టిడిపి పత్తిపాడు ఇన్‌ఛార్జి బూర్ల రామాంజనేయులు ఆరోపించారు. వలంటీర్లకు కానుకలు పంపిణీ చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, పరిశీలనకు వెళ్లిన తనపై ఆ పార్టీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని, తన కారును సైతం ధ్వంసం చేశారని బుధవారం నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసిపి, టిడిపి కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో నల్లపాడు పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల సమక్షంలోనే ఇరు గ్రూపులు ఘర్షణకు దిగారు. పోలీసులు అతి కష్టం మీద రామాంజనేయులును అక్కడి నుంచి పంపించి వేశారు. అయితే, ఇదే అంశంపై పలువురు వైసిపి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ అభ్యర్థులు జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. రామాంజనేయులు కావాలని పత్తిపాడు వైసిపి కార్యాలయంపై దాడి చేశారని, ఆయనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, మద్దాలి గిరి, వైసిపి అభ్యర్థులు బాలసాని కిరణ్ (పత్తిపాడు), నూరిఫాతిమా (గుంటూరు తూర్పు) తదితరులు ఫిర్యాదు చేశారు. వలంటీర్లు తమ కార్యాలయం వైపునకు కూడా రాలేదని, రామాంజనేయులు కావాలని తమ కార్యాలయంపై దాడికి వచ్చారని బాలసాని కిరణ్ ఆరోపించారు.

## మోడీని అనగలరా?

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పొత్తులు పెట్టుకున్నందుకు తమ పార్టీ అధినేతను రాజకీయ వికలాంగుడంటున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నరేంద్రమోడీని ఆ మాట అనగలరా అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. తమ పొత్తులు బహిరంగమయితే, జగన్‌వి చీకటి పొత్తులు కాదా అని బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మాఫియాలతో, కళంకితులతో జగన్‌కు ఉన్న పొత్తులు ప్రజలకు తెలుసునని తెలిపారు.

**వాలంటీర్లుగా ఐపిఎస్‌లు: బొండా ఉమా**

కొంతమంది ఐపిఎస్ అధికారులు వైసిపి వాలంటీర్లుగా వ్యవహరిస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. జగన్ ఆశీస్సులు ఉండటంతో వారు బరితెగించి ప్రవర్తిసున్నారని టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అడిషనల్ ఎస్పిలు నరేంధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డిలు ప్రతిపక్ష నాయకులు, ఎన్ని కల సంఘం అధికారుల ఫోన్లను ట్యాప్ చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. పలువురు అధికారులు వైసిపికి తొత్తుగా వ్యవహరిస్తు న్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు ఎంఎ షరీఫ్ లేఖ రాశారు.

## గల్లా జయదేవ్ ఎన్నికపై పిటిషన్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి
గత ఎన్నికల్లో గుంటూరు నుంచి గెలుపొందిన టిడిపి ఎంపి గల్లా జయదేవ్ ఎన్నికను సవాల్ చేస్తూ వైసిపి అభ్యర్థిగా ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. పోస్టల్ బ్యాలెట్లను తిరస్కరించడం వల్ల తాను ఓడిపోయానని, జయదేవ్ ఎన్నిక చెల్లదంటూ వేణుగోపాల్‌రెడ్డి సవాల్ చేసిన పిటిషన్‌ను జస్టిస్ రావు రఘునందన్‌రావు డిస్మిస్ చేశారు.

ఫాం 13బిలో బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్‌ను పొందుపరచకపోవడం తేడా కిందకే వస్తుందని, అలాంటి బ్యాలెట్ పేపర్లను తిరస్కరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని బుధవారం వెలువరించిన తీర్పులో పేర్కొన్నారు. మొత్తం 9,782 పోస్టల్ బ్యాలెట్లను తిరిగి లెక్కించాక ఫలితాన్ని వెల్లడించాలన్న పిటిషనరు వినతిని తోసిపుచ్చారు.

## ఆర్‌టిసి ఎమ్‌డికి సత్కారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
జాతీయ స్థాయిలో అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్స్ (ఎఎస్ఆర్‌టియు)కు ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును ఎంప్లాయిస్ యూనియన్ ఘనంగా సత్కరించింది. బుధవారం ఆర్‌టిసి హౌస్‌లో ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు ఎఎస్ఆర్‌టియు ఉపాధ్యక్షులుగా ఎన్నికవడంతోపాటు ఎపిఎస్ఆర్‌టిసి జాతీయ స్థాయిలో ఐదు అవార్డులను సాధించినందుకు గానూ ద్వారకా తిరుమలరావును సన్మానించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జివి నర్సయ్య, నాయకులు ఎమ్‌డిఎ సిద్ధిఖ్, భవాని, కోటేశ్వరరావు, శంకరరావు, వై శ్రీనివాసరావు తదితరులు ఎమ్‌డిని సన్మానించారు.



కెవి రత్నం భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి దంపతులు

## విద్యా రంగానికి కెవి రత్నం విశేష కృషి

- సామాజిక సేవలోనూ ముందంజ

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి
ప్రముఖ విద్యావేత్త కెవి రత్నం... విద్యా రంగానికి విశేష కృషి చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఉంటున్నారు. 1943 మే 23న చలపనాయుడుపల్లి కుగ్రామంలో కొర్రపాటి ఈశ్వరయ్యానాయుడు, తులసమ్మ దంపతులకు రెండో సంతానంగా ఆయన జన్మించారు. గ్రామంలో 3వ తరగతి, కొత్తపాళెం, ఆత్మకూరు ప్రాంతాల్లో పదో తరగతి వరకూ చదివారు. 1961-62లో పియుసి పూర్తి చేశారు. 1963 నుంచి 1966 వరకు నెల్లూరు విఆర్ కాలేజీలో బిఎస్‌సి కెమిస్ట్రీ డిగ్రీ తీసుకున్నారు. 1966 నెల్లూరు నగరంలోని రజక వీధిలో జయంతి ట్యుటోరియల్ ప్రారంభించారు. 1967లో తమ సమీప బంధువు పద్మావతిని వివాహం చేసుకున్నారు. చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి వందలాది చిన్నారులకు ఉచితంగా గుండె చికిత్సలు చేయించారు. 1986లో రత్నం కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. రత్నం విద్యా సంస్థలు అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రంలో ప్రముఖ విద్యా సంస్థలుగా నిలిచాయి. ఆయన కుమారులు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ కిషోర్ నెల్లూరు, తిరుపతి, హైదరాబాద్‌లలో రత్నం విద్యా సంస్థలు, పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, నెల్లూరు జిల్లా ఆత్మకూరు వద్ద ఇంజనీరింగ్ కాలేజీలు నడుపుతున్నారు. అనేక మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్‌కు ప్రత్యేక కోచింగ్ పొందుతున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, సినీ నటులు, రాజకీయనేతలుగా ఎదిగిన వారు ఉన్నారు. వేలాదిమంది విదేశాల్లో స్థిరపడ్డారు. కెవి రత్నం భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. వారిలో ఎంపిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయసాయి రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎంఎల్‌సి పి.చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తదితరులు ఉన్నారు.

## డిఎస్‌సి వాయిదా వేయాలి

- సిఎస్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ
- ఎన్నికల అనంతరం మెగా డిఎస్‌సి నిర్వహించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
డిఎస్‌సి వాయిదా వేసి ఎన్నికల అనంతరం మెగా డిఎస్‌సి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎన్నికల షెడ్యూలు నేపథ్యంలో సమగ్రంగా, మెగా డిఎస్‌సిని ప్రకటించలేదని తెలిపారు. రూ.30 వేల పోస్టులు ఖాళీ ఉండగా, ఆరువేల పోస్టులకు మాత్రమే డిఎస్‌సి ప్రకటించడం ఎన్నికల్లో లబ్ధి పొందడానికి తప్ప మరొకటి కాదని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రకారం కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ సమయంలో విద్యార్థులు చదువుకోవడానికి అంత సానుకూలత ఉండదని తెలిపారు. అలాగే టెట్ పరీక్షలు జరిగాయని, డిఎస్‌సి ప్రిపేర్ కావడానికి కూడా సమయం కావాలని అన్నారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సన్నద్ధం అవుతున్నారని, వీరంతా పదోతరగతి పేపర్లు దిద్దడానికి వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## సి-విజిల్ యాప్‌తో ఎన్నికల అక్రమాలకు అడ్డుకట్ట

- టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సి-విజిల్ యాప్‌ను వినియోగించడం ద్వారా ఎన్నికల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూర్తిస్థాయిలో జనం నమ్మకం, మద్దతు కోల్పోవడంతో ఎన్నికల్లో అక్రమాలను చివరి అస్త్రంగా ఎంచుకున్నారని తెలిపారు. దీనిని అడ్డుకునేందుకు ప్రజలు బాధ్యత తీసుకుని ముందడుగు వేయాలని కోరారు. డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, ప్రభుత్వ ఉద్యోగులతో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించడం, ప్రత్యర్థి పార్టీలపై తప్పుడు ప్రచారం చేయడం వంటి వివిధ ఉల్లంఘనలపై సి-విజిల్ యాప్ ద్వారా ప్రజలే నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలు తమ దృష్టికి వచ్చిన ప్రతి తప్పును అత్యంత సులభంగా ఇసి దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉందన్నారు. సి విజిల్ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నిబంధనల అమలు విషయంలో టెక్నాలజీని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. జగన్ రివర్స్ పాలనతో రాష్ట్రంలో ఎక్కువ నష్టపోయింది యువతే అని తెలిపారు. తమ భవిష్యత్ కోసం సమర్థవంతమైన నాయకత్వాన్ని యువత గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తరువాత కూడా కొత్తగా ఓట్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని, దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నారా లోకేష్ కాన్వాయ్ తనిఖీ



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి కరకట్ట వద్ద నారా లోకేష్ కాన్వాయ్‌ని పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలలో భాగంగా ఉండవల్లి చెక్‌పోస్టు వద్ద ఆయన కాన్వాయ్‌ను ఆపారు. కోడ్ అమలులో భాగంగా తనిఖీ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. తనిఖీలకు ఆయన సహకరించారు. కాన్వాయ్‌లో ఉన్న కార్లన్నింటినీ తనిఖీ చేసి ఎటువంటి వస్తువులు, నగదు దొరకలేదని ప్రకటించారు. ఉండవల్లిలోని ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు నివాసం నుంచి తాడేపల్లిలోని అపార్ట్‌మెంట్ వాసులతో ముఖాముఖి కార్యక్రమానికి వెళ్తున్న నారా లోకేష్ కాన్వాయ్‌ని ఆపి తనిఖీ తనిఖీలు చేశారు.

## పవన్ బరిలో లేకుంటే నేనే పోటీ చేస్తా

**పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ**

ప్రజాశక్తి - పిఠాపురం (కాకినాడ జిల్లా)
జనసేన అధినేత పవన్ కల్యాణ్ బరిలో లేకుంటే పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానని మాజీ ఎమ్మెల్యే, టిడిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్‌విఎస్‌ఎన్ వర్మ అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఎస్‌విఎస్ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఆదేశం మేరకు పిఠాపురం నుంచి పోటీ చేస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో ఆయన గెలుపునకు శక్తి వంచన లేకుండా సహకరిస్తామన్నారు. ఒకవేళ నియోజకవర్గం నుంచి పవన్ పోటీ చేయకుండా వేరే ఎవరైనా పోటీలో నిల్చుంటే మాత్రం కార్యకర్తల అభీష్టం మేరకు తాను కచ్చితంగా పోటీలో ఉండి తీరుతానని స్పష్టం చేశారు. పవన్ బరిలో లేకుంటే టిడిపి నుంచి తనకే అవకాశం ఇస్తానని చంద్రబాబు తెలిపారన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. ప్రస్తుతం మత్స్యకారులు, రైతులు నానా కష్టాలు పడుతున్నారని, వారిని పట్టించుకునే వారే కనిపించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కష్ట కాలంలో ప్రజలను ఆదుకోని నాయకులు ఎలా ఓట్లను అడుగుతారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బర్ల అప్పారావు, ఎస్ గంగాధర్, నల్ల శ్రీను, రాజు బాబు, దేవేంద్రుడు, మాణిక్యం పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు ఎమ్మెల్యే 'రాచమల్లు'పై కేసు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరు వైసిపి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిపై బుధవారం కేసు నమోదైంది. మంగళవారం ఆయన పట్టణంలోని 38వ వార్డులో వైసిపి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించినందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు హైమావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం చీరలు పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు అనుచరులపైనా కేసు నమోదైంది.

## 15 మంది వలంటీర్లు తొలగింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు, పొదిలి

వైఎస్‌ఆర్ జిల్లాలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 12 మందిని, ప్రకాశం జిల్లాలో ముగ్గురు వలంటీర్లను బుధవారం తొలగించారు. వైఎస్‌ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండల పరిధిలోని దొమ్మర నంద్యాల గ్రామంలో విధులు నిర్వహిస్తున్న 11 మంది వలంటీర్లు ఈ నెల 17న జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వలంటీర్లను ఎంపిడిఒ శంషాద్ భాను తొలగించారు. ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 18వ వార్డు సచివాలయంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపిరెడ్డి వెంకట ధనుంజయ్.. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మంగళవారం 38వ వార్డులో వైసిపి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని, దీంతో ఆయనను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లా పొదిలిలో వైసిపి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు జిలానీ, మల్లీశ్వరి, మందగిరి రమేష్‌ను విధుల నుంచి పొదిలి ఎంపిడిఒ గోసియాబేగం తొలగించారు.

## కర్ణాటక మద్యం అక్రమ తరలింపు

● వలంటీర్ అరెస్టు

ప్రజాశక్తి-రాయదుర్గం

కర్ణాటక మద్యాన్ని అనంతపురం జిల్లా వలంటీర్ అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామానికి చెందిన హనుమంతు గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. కర్ణాటక నుంచి 380 టెట్రా ప్యాకెట్లను తన ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి తీసుకుని వస్తుండగా ఆంధ్రా, కర్ణాటక సరిహద్దులో పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. టెట్రా ప్యాకెట్లతో పాటు రూ.9800 నగదు, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వలంటీర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# బిజెపి పొత్తుతో టిడిపిలో అసమ్మతి

- తిరుపతిలో నిరసన గళం
- టికెట్ కేటాయించకపోతే రెబల్‌గా పోటీ చేస్తామని హెచ్చరికలు
- నరసరావుపేట మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్మహత్యాయత్నం



తిరుపతిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుగుణమ్మ

ప్రజాశక్తి - యంత్రాంగం

బిజెపి, జనసేనతో పొత్తులో భాగంగా కొన్ని సీట్లను ఆ పార్టీలకు కేటాయించడంతో టిడిపిలో చిచ్చురేపింది. పలుచోట్ల ఆశావహులు రోడ్డెక్కారు. పలుచోట్ల నిరసన గళం వినిపించారు. పార్టీని నమ్ముకున్న నాయకులను, కార్యకర్తలను టిడిపి అధినేత చంద్రబాబు దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపితో పొత్తు పార్టీకి నష్టమని కార్యకర్తలు వాపోతున్నారు. చంద్రబాబు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పొత్తులో భాగంగా తిరుపతి స్థానానికి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు కేటాయించారు. దీంతో ఆరణికి వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఆరణి పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. తనకు టికెట్ కేటాయించకపోతే రెబల్‌గా బరిలో దిగుతానని బుధవారం మీడియా సమావేశంలో సుగుణమ్మ హెచ్చరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కొడుకు బొజ్జల సుధీర్‌రెడ్డికి టికెట్ ప్రకటించడంతో మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పోటీలో ఉన్నానని, చంద్రబాబు మరోసారి పునరాలోచించాలని మీడియా వేదికగా ఆయన హెచ్చరించారు. వెంకటగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీప్రియకు టికెట్ కేటాయించడంతో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. బిసిలకు సీటు ఇవ్వకపోతే టిడిపి గల్లంతు ఖాయమని ఆయన బహిరంగంగా ప్రకటించారు. వలసొచ్చిన వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి సత్యవేడులో టికెట్ ఖరారు చేయడంతో ఆశావహుడైన జెడి రాజశేఖర్ రెబల్ బెల్ మోగించారు. స్వతంత్రంగానైనా బరిలో దిగేందుకు ప్రచారాన్ని ప్రారంభించారు.

### విశాఖ దక్షిణం సీటుపై జనసేనలో రగడ

విశాఖ దక్షిణం సీటుపై జనసేన నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. ఎక్కడి నుంచో తీసుకొచ్చిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను తమ నెత్తి మీద పెట్టడం ఎంతవరకు సమంజసం అంటూ ఒక గ్రూపు వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వంశీకృష్ణకు సీటు వద్దు స్థానికులు ముద్దు అంటూ దక్షిణ నియోజకవర్గ జనసేన నేతలు మూగి శ్రీనివాస్, కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్ గ్రూపు నాయకులు తగలబెట్టడంతో వివాదం చోటుచేసుకుంది. వంశీకృష్ణ గ్రూపు చెందిన సుమారు 50 మంది వచ్చి తమ నేత పోస్టర్లను ఎందుకు తగలబెట్టారంటూ గొడవకు దిగారు. వివాదం పెద్దది కావడంతో పోలీసులు వచ్చి సర్ది చెప్పారు.

పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు టికెట్ కేటాయించాలని ఆ పార్టీ నేత నరసరావుపేట మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ టికెట్ జనసేన పార్టీకి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు.



ఫ్యాక్టరీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

## 'చెట్టినాడ్' వ్యర్థాలతో పంటలు నాశనం

● సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద మిర్చి రైతుల ఆందోళన

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)

సిమెంట్ ఫ్యాక్టరీ నుండి వచ్చే వ్యర్థాలు, కాలుష్యంతో వల్ల తమ పొలాలు పాడవడంతో పాటు పంట సైతం నాశనమవుతోందంటూ మిర్చి రైతులు ఆందోళనకు దిగారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడులోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ గేటు ఎదుట తక్కెళ్లపాడు గ్రామ రైతులు దెబ్బతిన్న తమ మిర్చి పంటతో బుధవారం బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ పరిసరాల్లోని 50 ఎకరాల పంట భూమి దెబ్బతింటోందని, ఫ్యాక్టరీ వ్యర్థాల వల్ల భూమి పగుళ్లు వచ్చి దిగుబడి ఎకరాకు సగటున మూడు నాలుగు క్వింటాళ్ల వరకూ పడిపోతోందని వాపోయారు. మరోవైపు పైనుంచి వచ్చే దుమ్ము, దూళి కారణంగా మిర్చి కాయ కుళ్లిపోతోందని, మిగిలిన పంటను క్వింటాల్ రూ.ఐదారువేలు ధర తగ్గించి కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాచేపల్లి సిఐ సురేంద్రబాబు, ఎస్‌ఐ సంధ్యారాణి అక్కడకు వచ్చారు. ఫ్యాక్టరీ వారితో మాట్లాడి వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ తరుపున ఎస్టేట్ వ్యవహారాలను చూసే అధికారితో మాట్లాడగా రైతులకు ప్రత్యామ్నాయం చూపుతామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బాధిత రైతులు పి రామసైదులు, పి నాగరాజు, జి సాంబయ్య, జి గోవర్ధన్, జి సుబ్బయ్య, బి ప్రభాకర్ పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ (తిరుపతి జిల్లా)



కొండేటి మణి (ఫైల్ )

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. తిరుపతి జిల్లాలో బుధవారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... బిఎన్ కండ్రిగ మండలం వెస్ట్ వరత్తూరు గ్రామానికి చెందిన కొండేటి మణి (30)కి రెండు ఎకరాల పొలం ఉంది. మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశారు. పంటకు తెగులు సోకి పూర్తిగా నష్టం వాటిల్లింది. పెట్టుబడి కోసం తెచ్చిన నాలుగు లక్షల రూపాయల అప్పు ఎలా తీర్చాలో తెలియక దిగులుతో పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పక్క పొలాల్లోని రైతులు గమనించి ఆయన భార్య లేఖకు సమాచారం ఇచ్చారు. రైతు కుటుంబాన్ని ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# చేబ్రోలులో జంట హత్యలు

● వివాహేతర సంబంధమే కారణం?

ప్రజాశక్తి - పిఠాపురం (కాకినాడ జిల్లా)



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బుధవారం జంటహత్యలు కలకలం రేపాయి. వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చేబ్రోలుకు చెందిన పి లోవమ్మ (35) భర్తతో విభేదాల వల్ల విడిపోయి వ్యవసాయ కార్మికురాలిగా ఉంటూ పిల్లలను పోషించుకుంటున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వివాహితుడు ఎల్ నాగబాబుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇటీవల కాలంలో స్థానిక రైతు పి శ్రీను (45)తోనూ ఆమె పరిచయం పెంచుకున్నారు. ఈ విషయంలో నాగబాబు, లోవమ్మల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం చేబ్రోలు శివారు లక్ష్మీపురంలో ఉన్న శ్రీను పొలంలో పనికి లోవమ్మ వెళ్లారు. విషయం తెలుసుకున్న నాగబాబు లక్ష్మీపురం వచ్చి పొలంలో ఉన్న లోవమ్మ, శ్రీనులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. ఈ దాడిలో శ్రీను, లోవమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని డిఎస్‌పి హనుమంతరావు, సిఐ శ్రీనివాస్ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్



తారకేశ్వరరావు

చదువులో రాణించలేక మనస్తాపంతో బిటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పార్వతీపురంలోని 29వ వార్డు కుసుమగుడి వీధికి చెందిన కల్లూరి శంకరరావు, ఢిల్లీశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తారకేశ్వరరావు (18) విజయనగరంలోని సెంచూరియన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాలేజీలో ప్రవేశం నాటి నుంచి తనకు ఇంజనీరింగ్ విద్య బోధపడటం లేదని, చాలా కష్టంగా ఉందని తరచూ తల్లిదండ్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండేవారు.

ఈ నేపథ్యంలో చదువులో రాణించలేకపోతున్నానని తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు శంకరరావు, ఢిల్లీశ్వరి హోటల్ నిర్వహణ నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో తారకేశ్వరరావు ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల సమాచారంతో పట్టణ ఎస్‌ఐ పి.సంతోషికుమారి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయానికి కత్తిరింపులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బ్యాంకర్లు తయారుచేసిన రుణ ప్రణాళికలో వ్యవసాయ అనుబంధ రంగాలకు కోతలు పడ్డాయి. దీనిని శుక్రవారం జరిగే కీలక సమావేశంలో ఆమోదించను న్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 4,43,000 కోట్లకు రుణ ప్రణాళికను ఆమోదించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 5,25,000 కోట్లకు ఖరారు చేశారు. అంటే మొత్తం 19 శాతం వృద్ధి ఉన్నట్లు పేర్కొన్నా రు. అయితే వ్యవసాయ రంగంలోని యాంత్రీ కరణకు గతేడాది మూడు వేల కోట్లు ఖరారు చేయగా, ప్రస్తుతం 1,200 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. దీనివల్ల ఏకంగా 60 శాతం ఈ రంగానికి కోత పడింది. పాడి అభివృద్ధికి గతేడాది తొమ్మిది వేల కోట్లు కేటాయించగా, ఈ ఏడాది 61 శాతం కోతలతో 3,500 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. వ్యవసాయ మౌళికాభివృద్ధి, ప్రధానమంత్రి ఆవాస యోజన, ఎగుమతుల రుణాలు, సామాజిక మౌళికాభివృద్ధి, పునరుత్పాక విద్యుత్ రంగాలకు కూడా రుణ కేటాయింపులు పెంచలేదు.

### విడుదల కాని రుణాలు

గత ఏడాది ఖరారు చేసిన 4.43 లక్షల కోట్ల రుణ ప్రణాళికలో డిసెంబర్ వరకు 108 శాతం అధికంగా లక్ష్యాన్ని సాధించారు. ఇందులో కూడా వ్యవసాయ మౌళికాభివృద్ధి రంగంలో 60 శాతం తక్కువగా లక్ష్యాన్ని సాధించారు. మూడు వేల కోట్ల రుణ ప్రణాళికలో కేవలం 795 కోట్లు మాత్రమే లక్ష్యాన్ని సాధించడం విశేషం. ఎగుమతులకు ఇచ్చే రుణంలో కూడా70 శాతం, గృహ నిర్మాణాలకు ఇచ్చే రుణాల్లో 45 శాతం, సామాజిక మౌళికాభివృద్ధిలో 53 శాతం, పునరుత్పాదక విద్యుత్ రంగంలో 62 శాతం, ఇతర రంగాల్లో 75 శాతం తక్కువగా లక్ష్యాన్ని సాధించినట్లు తేలింది. అయితే ఆయా రంగాల్లో కేటాయించిన రుణాలను లబ్దిదారులు వినియోగించు కోలేకపోయారా, లేక బ్యాంకుల నుంచి రుణాలు విడుదల కాలేదా అన్నది స్పష్టంగా తెలియడం లేదు. గతేడాది తక్కువ లక్ష్యాన్ని సాధించిన రంగాలకు ఈ ఏడాది కేటాయింపులు తగ్గించి చూపించినట్లు కనిపిస్తోంది.

## నేను రాయలసీమ బిడ్డనే..

● దేనికీ భయపడను : భువనేశ్వరి

ప్రజాశక్తి-యంత్రాంగం

వైసిపి ప్రభుత్వం కక్షసాధింపుతోనే అక్రమ కేసులు పెట్టిందని, తాను కూడా రాయలసీమ పౌరుషం కలిగిన బిడ్డనని దేనికైనా భయపడే ప్రసక్తే లేదని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లాలో గాలివీడు మండలంలో బుధవారం ఆమె పర్యటించారు. గుండెపోటుతో మృతి చెందిన ఎగవ గొట్టివీడు గ్రామ సర్పంచ్ ప్రభాకర్ నాయుడు సతీమణి రెడ్డమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. తొలుత రెడ్డమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదుర్కొని నిజాన్ని గెలిపించుకోవాలని కోరారు. పీలేరులో భువనేశ్వరి కాన్వాయ్‌లోని ఓ వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, టిడిపి శ్రేణుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మీడియా వాహనాన్ని సైతం పోలీసులు అడ్డుకోవడంతో మీడియా ప్రతినిధులు అసహనాన్ని వ్యక్తం చేశారు. కాగా దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని నారా లోకేష్ దంపతులు బుధవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. గురువారం దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లా రాయచోటిలో 'నిజం గెలవాలి' యాత్రలో ఉన్న భువనేశ్వరి ముందుగానే తిరుమలకు చేరుకున్నారు. ఆమెకు టిడిపి అధ్యక్షులు రాజు యాదవ్ సాదర స్వాగతం పలికారు.

## భారత్‌కు 8 శాతం వృద్ధి అవసరం

- అప్పుడే సరిపడ ఉపాధి కల్పన
- చాలా మౌలిక వసతులను కల్పించాల్సి ఉంది
- ఐఎంఎఫ్ ప్రతినిధి క్రిష్ణమూర్తి సుబ్రమణియన్

**న్యూఢిల్లీ :** భారత్‌లో పేదరికం నిర్మూలన, సరిపడ ఉద్యోగాలను కల్పించాలంటే ప్రతీ ఏడాది 8 శాతం వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) భారత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రిష్ణమూర్తి వెంకట సుబ్రమణియన్ అన్నారు. అసమానతలను తగ్గించడానికి స్థిరమైన వృద్ధి అవసరమన్నారు. ఒఎంఐ ఫౌండేషన్ రూపొందించిన 'ఆర్థిక వ్యవస్థలో సామాజిక రక్షణ-అన్ ప్యాకింగ్ సప్లై డైనమిక్స్' రిపోర్ట్‌ను సుబ్రమణియన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా భారత ఆర్థిక వ్యవస్థను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. "మనం 7 శాతం వృద్ధిని నమోదు చేసినప్పటికీ అసహనంగానే భావిస్తున్నాం. దేశం చాలా మౌలిక సదుపాయాలను సృష్టించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం 8 శాతం అంతకంటే ఎక్కువ వృద్ధి చెందాలి." అని ఒఎంఐ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో సుబ్రమణియన్ అన్నారు. ఎనిమిది శాతం వృద్ధి ద్వారా చాలా ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం ఉంటుంద ని.. తద్వారా పేదరికం, అసమాన తలను తగ్గించ వచ్చున్నారు. గడిచిన ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధి రేటును ఆయన గుర్తు చేశారు. "ఆర్థిక లోటును 3 శాతానికి తగ్గించడం, జిడిపిలో అప్పుల నిష్పత్తిని 66 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని భారత్ పాశ్చాత్యా దేశాల నమూనాను కాపీ చేసింది. అయితే ఇది భారత పరిస్థితులకు సరిపోకపోవచ్చు. అమెరికా, యూరప్ తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారింది. అయితే ఆయా దేశాలతో పోల్చితే భారత ఆర్థిక వ్యవస్థ చాలా భిన్నమైంది. ఆయా దేశాలు దాదాపుగా మౌలిక వసతుల అభివృద్ధిని పూర్తి చేశాయి. అసమానతలను తగ్గించాయి." అని సుబ్రమణియన్ పేర్కొన్నారు.

ఒఎంఐ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐశ్వర్య రామన్ మాట్లాడుతూ.. వివిధ వేదికల్లో పని చేస్తున్న కార్మికులకు సమగ్రమైన, అర్థవంతమైన సామాజిక రక్షణలను అందించడానికి పరస్పర సహకారాలు అవసరం అన్నారు.



సీజ్ చేసిన చీరలను తరలిస్తున్న పోలీసులు

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన

● వైసిపి నాయకుడి దుకాణంలో చీరలు సీజ్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ఓటర్లకు పంపిణీ చేసేందుకు వైసిపి నాయకుని దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 1680 చీరలను ఎన్నికల అధికారులు బుధవారం సీజ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య కాంప్లెక్స్‌లో కెవిఆర్ మార్ట్ పేరుతో వైసిపి మండల నాయకులు సూపర్ బజార్ నిర్వహిస్తున్నారు. మహిళా ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీగా చీరలు తీసుకొచ్చారు. విషయం తెలిసిన టిడిపి నాయకులు కెవిఆర్ మార్ట్ ఎదుట ఆందోళన చేశారు. వైసిపి నాయకులూ అక్కడికి చేరుకోవడంతో ఇరు గ్రూపుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో టిడిపి నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరు గ్రూపులను చెదరగొట్టారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కెవిఎల్ నరసింహారావు దుకాణంలో తనిఖీలు చేపట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మలతో ఉన్న చీరలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క అట్టపెటెలో 48 చీరల బాక్సులు ఉన్నాయి. 35 అట్టపెట్టలను అధికారులు సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. షాపు పరిసర ప్రాంతాల్లో పోలీస్ బలగాలు మోహరించాయి.

# కందిపంటలో గంజాయి సాగు

● 282 మొక్కలు స్వాధీనం, నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా), మైదుకూరు



అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

కంది పంటలో గంజాయి మొక్కలు సాగు చేసిన నిందితుడిని ఎస్ఇబి అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఇబి అధికారుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలోని గంగుపల్లి గ్రామానికి చెందిన కేశనపల్లి బ్రహ్మయ్య తన ఐదెకరాల పొలంలో కంది పంట సాగు చేశారు. అప్పుల బారి నుంచి బయటపడేందుకు గంజాయి విత్తనాలు కొనుగోలు చేసి వాటిని కంది పంటలో వేశారు. మొత్తం 282 గంజాయి మొక్కలు సాగు చేశారు. ఎస్ఇబి అధికారులకు అందిన సమాచారం మేరకు బ్రహ్మయ్య కంది పంటను బుధవారం వారు పరిశీలించారు. గంజాయి మొక్కలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. రెండు నుంచి ఆరు అడుగుల ఎత్తు వరకు గంజాయి మొక్కలు పెరిగాయని, వీటి విలువ రూ. మూడు లక్షల వరకు ఉంటుందని ఎస్ఇబి సిఐ నాగేశ్వరరావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### వైఎస్ఆర్ జిల్లాలో 12 కేజీల గంజాయి స్వాధీనం

వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు పట్టణంలోని వీణ విజయరామరాజు కాలనీలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. గంజాయి రవాణా చేస్తున్న మైదుకూరు మండలం గొల్లపల్లెకు చెందిన మదెం సుస్మంత్ కుమార్, చెన్నూరు లక్ష్మీనగర్‌కు చెందిన గంధం సుబ్బరాయుడు, ప్రొద్దుటూరు శ్రీనివాస్ నగర్‌కు చెందిన మేకల సునీల్, మైదుకూరు వీణ విజయరామరాజు కాలనీకి చెందిన సాంబరావు వెంకటయ్యను అరెస్టు చేశారు. వారి నుంచి 12.100 కేజీల గంజాయితో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డిఎస్‌పి వెంకటేశుతెలిపారు.

## వైసిపిలో చేరిన శేషుకుమారి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిఠాపురం నియోజకవర్గం జనసేన మాజీ ఇన్‌ఛార్జి ఎం శేషుకుమారి వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఆమెకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థి వంగా గీత పాల్గొన్నారు. అలాగే సిఎం సమక్షంలో రాధా రంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షులు వంగవీటి నరేంద్ర, మిత్ర మండలి సభ్యులు షేక్‌బాబు, ఇమ్రాన్ రాజా, నాగ శ్రీనివాస్, పి నరేంద్ర వైసిపిలో చేరారు.

సంపాదకీయం


# రాళ్లెత్తిన కూలీలెవ్వరు?

ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి నాలుగు నెలల వయసున్న తన మనవడికి 240 కోట్ల రూపాయల బహుమతి ఇచ్చారన్న వార్త దేశ వ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. ఆ బుడ్డోడి అదృష్టానికి ఎందరో మురిసిపోయారు. సిల్వర్ స్పూన్‌తో పుట్టాడంటారే... అలాగన్నమాట! నిజానికి ఇది అంతకన్నా ఎక్కువే! నారాయణమూర్తికి ఇన్ఫోసిస్‌లో 1.51 కోట్ల షేర్లు ఉంటే అందులో ఆయన తన మనవడి పేరిట బదిలీ చేసింది కేవలం 15 లక్షల షేర్లే! అంటే గోరంత! ఆ మాత్రానికే నారాయణ మూర్తి మనవడు అతి చిన్న వయసులోనే ద్విశతకోటీశ్వరుడైన రికార్డును సొంతం చేసుకున్నాడు. ఇవాళ కాకపోతే రేపైనా ఆయన ఆస్తులన్నీ మనవడికి దక్కాల్సిందే. మరి, అంత హడావిడిగా అన్ని వందల కోట్లు ఎందుకు బదిలీ చేసినట్టు? పెద్దోళ్ల వ్యవహారాలకు ఎన్నో అర్థాలుంటాయి. ఆ లావాదేవీలు సామాన్య మానవులకు అంత సులభంగా అర్థం కావు! వారానికి 70 గంటలు పనిచేయాలంటూ దేశ యువతకు నారాయణ మూర్తి ఇటీవల పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. అంటే, వారాంతపు సెలవు కూడా లేకుండా రోజుకి 10 గంటలు అలా వారంలో ఏడు రోజులూ పని చేయాలని, లేకపోతే సోమరుల కింద లెక్కని ఆయన అప్పట్లో ఉద్బోధించారు. ఈ వ్యాఖ్యలపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. ఇంతకూ నూతనంగా శతకోటీశ్వరుల జాబితాకెక్కిన నారాయణ మూర్తి మనవడు రోజుకు ఎన్ని గంటలు చెమటలు చిందించాడో? 77 సంవత్సరాల నారాయణ మూర్తికి ఫోర్బ్స్ లెక్కల ప్రకారం సుమారుగా 38,981 కోట్ల రూపాయల సంపద ఉంది. 1981లో అంటే తన భార్య సుధామూర్తి దగ్గర తీసుకున్న 10 వేల రూపాయలతో ఆరుగురు ఇంజినీర్లతో కలిసి ఆయన ఇన్ఫోసిస్ ఏర్పాటు చేసినట్టు చెబుతారు. ఈ 43 సంవత్సరాల కాలంలో ఆయన రోజుకు ఎన్ని గంటలు శ్రమపడితే ఇంత సంపద పోగుపడింది...?

ఇంతకన్నా ఘనమైనది ఇటీవల కాలంలోనే మరొకటి జరిగింది. అది రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుమారుడి ప్రీ-వెడ్డింగ్ (పెళ్లికి ముందు జరిపే) వేడుకలు! గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలకు అంబానీ కుటుంబం ఖర్చు చేసింది అక్షరాలా 1,259 కోట్ల రూపాయలు మాత్రమే! అంతమొత్తంతో ఏం చేశారని అడగకండి! ఐ.టి, ఇ.డి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలే అటువంటి ప్రశ్నలు అడగడానికి సాహసించవు. ఇంతకూ చెప్పొచ్చేదేమిటంటే ముఖేష్ అంబానీకి 9.70 లక్షల కోట్ల రూపాయల సంపద ఉంటుందని అంచనా! ఆ మొత్తంలో కుమారుని ముచ్చట కోసం చేసిన ఖర్చు సముద్రంలో నీటి బొట్టంతే! కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శరవేగంగా అభివృద్ధి చెందిన గౌతమ్ అదానీ మొత్తం ఆస్తుల విలువ 6.75 లక్షల కోట్లు! ఎన్ని గంటలు చెమటలు చిందిస్తే అంబానీలు, అదానీలు ఇంత సంపదను పోగేశారో!

మరోవైపు దేశంలో 19 కోట్ల మంది ప్రజలు ఆకలితో అల్లాడుతున్నారు. 125 దేశాలతో రూపొందించిన గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో మనది 111వ స్థానం. ఐక్య రాజ్యసమితి విడుదల చేసిన మరో నివేదిక ప్రకారం దేశ జనాభాలో 16 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. సంతానోత్పత్తి సామర్థ్యం ఉన్న మహిళల్లో 53 శాతం మంది రక్తహీనతతో సతమతమవుతున్నారు. దేశ జనాభాలో దాదాపుగా 21.25 శాతం మంది రోజుకు 160 రూపాయల కన్నా తక్కువ మొత్తంతో కుటుంబాలను లాక్కొస్తున్నారు. రోజుకి పది కాదు. పన్నెండు, పద్నాలుగు గంటలు పనిచేస్తున్నా తరతరాలుగా వీరిని పేదరికం వెంటాడుతూనే ఉంది. దేశ జనాభాలో అత్యధికులు చాలీచాలని సంపాదనతో అష్టకష్టాలు పడుతుంటే అతి కొద్దిమంది సకల సౌఖ్యాలను ఎలా పొందుతున్నారు?! శ్రమ చేస్తున్నారా? శ్రమను దోచుకుంటున్నారా? దేశ వ్యాప్తంగా కోట్లాది మంది రెక్కల కష్టం వీరి సంపదగా మారుతోంది. అంతులేని పేదరికానికి, తరతరాల కష్టాలకు కారణం ఇదే! అందుకే మహాకవి శ్రీశ్రీ 'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు?...ప్రభువెక్కిన పల్లకి కాదోయ్, అది మోసిన బోయీ లెవ్వరు?' అని ప్రశ్నిస్తారు. అదానీలు, అంబానీలు, నారాయణమూర్తిల మెరుపులకు అసలు కారణమేమిటో దేశ ప్రజానీకం తెలుసుకోవాలి. అప్పుడే ఆచార్య ఆత్రేయ అప్పుడెప్పుడో రాసినట్టు 'చాకిరొకరిది...సౌఖ్యమొకరిది సాగదింక' అంటూ కదిలే రోజులొస్తాయి.

మహనీయుని మాట



**వ్యక్తి ప్రయోజనాల కన్నా సమాజ ప్రయోజనాలు అతి ముఖ్యం. ఈ రెంటికీ మధ్య న్యాయమైన, సమతుల్యమైన సంబంధాలు ఏర్పరచాలి.**

**- లెవిస్ హెన్రీ మోర్గాన్,** సామాజిక సిద్ధాంతకర్త.

# ల్యాండ్ టైటిల్ చట్టంతో ప్రజలకు మేలు జరిగేనా?



విశ్లేషణ



కె. లోకనాథం

**ఇప్పటి వరకు కార్పొరేట్ కంపెనీలకు భూములు కావాలంటే భూ యజమానుల దగ్గర నుండి ఎపిఐఐసి భూములను సేకరిస్తుంది. ఈ భూ సేకరణలో నష్టపోయిన వారు కోర్టులకెళ్లి న్యాయం పొందే అవకాముంది. నేడు ఈ చట్టం అమల్లోకి వస్తే రైతులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కార్పొరేట్ శక్తులకు భూములు ధారాదత్తం చేయవచ్చు. ఈ చట్టం ప్రకారం దీనినెవరూ కోర్టుకెళ్లి సవాలు చేసి న్యాయం పొందే అవకాశం లేదు. కార్పొరేట్ కంపెనీల అవసరాలకు భూములకు కేటాయింపులు చేస్తారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆంధ్ర రాష్ట్రం ఎర్ర తివాచీ పరిచినట్లే.**

కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను సంస్కరణల ప్రయోగశాలగా మార్చేసింది. భూములను కార్పొరేట్ కంపెనీలకు మరింత సులభంగా అందించేందుకు వీలుగా భూ హక్కుల చట్టాన్ని తీసుకొచ్చారు. అందులో భాగంగానే భూ వ్యవహారాలపై చట్టాన్ని రూపొందించి రాష్ట్రపతి ఆమోదం పొందేందుకుగాను మోడీ ప్రభుత్వం సహకారం అందించింది. బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా చేయని ప్రయోగాలను ఆంధ్ర రాష్ట్రంలో చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తూచ తప్పకుండా అమలు చేస్తున్నది. అందులో భాగంగానే నూతన విద్యా విధానం, పట్టణ సంస్కరణలు, 2020 విద్యుత్ చట్టాన్ని అమలు చేస్తున్నారు. వాటి ఫలితంగా ప్రజల నడ్డివిరిచేలా భారాలు తీవ్రంగా పడుతున్నాయి. తీర, అటవీ ప్రాంతాలను అదానీ, అంబానీ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎ.పి ల్యాండ్ టైటిల్ చట్టం 27/2022తో వీటికన్నా తీవ్రమైన ప్రమాదం పొంచి వున్నది. ఈ చట్టం అమలు కోసం జీవో నెం 512 తీసుకొచ్చారు. దీనిపై న్యాయవాదులు, సన్న, చిన్నకారు రైతులు, ప్రజాతంత్రవాదులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సన్నాయి నొక్కులు నొక్కుతున్నది.

దేశంలో ఎక్కడా అమలు కాని ఒక కొత్త పద్ధతిని రాష్ట్రంలో తీసుకొచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. ఒక చట్టం తీసుకురావాలంటే విస్తృతంగా ప్రజలలో చర్చ పెట్టాలి. భూ సమస్యలపై పనిచేస్తున్న నిపుణులు, న్యాయకోవిదులను భాగస్వాలములను చేయాలి. అలాకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఎ.పి ల్యాండ్ టైటిల్లింగ్ చట్టాన్ని తీసుకొచ్చి ప్రజల మీద రుద్దాలని చూస్తోంది. ఈ చట్టం వలన ప్రజలకి లాభమా? నష్టమా అనేదాని చుట్టూ అనేక అనుమానాలున్నాయి. కాని ఈ చట్టంపై అపోహలు వద్దని ప్రైవేట్ భూములకు ఎలాంటి ఢోకా లేదని...భూ వివాదాలు, మోసాలను అరికట్టి యాజమాన్యపు హక్కులపై పూర్తి భరోసా వుంటుందని ప్రభుత్వ పెద్దలు సెలవిస్తున్నారు. కాని భూ-మ్యుటేషన్ ప్రారంభం నుండే భూ తగాదాలు మొదలైనట్లు కొన్ని కథనాలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతమున్న పద్ధతి ఏమిటి? కొత్తగా తీసుకొచ్చిన ఎ.పి ల్యాండ్ టైటిల్ గ్యారంటీ పద్ధతి ఏమిటి? ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన చట్టం భూ సమస్యలు పరిష్కారం చేసే చట్టమా? లేదా మరిన్ని సమస్యలను సృష్టించే చట్టమా అనేది పరిశీలించాలి. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న పద్ధతిని ప్రాస్పెక్టివ్ టైటిల్ అంటారు. భూమి/భవన యాజమాన్య హక్కులను ప్రభుత్వం గుర్తించడానికి 30 రకాల రికార్డులు వున్నాయి. గ్రామ స్థాయిలో 11 రిజిస్టర్లు వుంటాయి. పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడీ, అడంగల్...వంటి వాటి ద్వారా భూ యజమాని ఎవరనేది గుర్తిస్తున్నారు. అయితే రెవిన్యూ అధికారులు, రాజకీయ నాయకులు, గ్రామ పెత్తందార్ల జోక్యంతో అనేక వివాదాలు వస్తున్నాయి. భూమి సాగులో ఒకరుంటే రికార్డుల్లో వేరొకరి పేరు దర్శనమిచ్చే సందర్భాలు కోకొల్లలు. ఈ తప్పులు జరగటానికి ప్రధాన కారణం ఇప్పుడున్న రెవిన్యూ వ్యవస్థ అనేది తెలిసిన విషయమే. అటువంటి రెవిన్యూ అవకతవకల వలనగాని మరే ఇతర విధంగా అయినా భూ వివాదాలు వచ్చినప్పుడు ప్రజలు వెంటనే కోర్టుని ఆశ్రయించి న్యాయం పొందుతున్నారు. ఇప్పుడున్న చట్టం ప్రకారం కోర్టు, సివిల్ ప్రొసీజర్ కోడ్‌ను అనుసరించి వాదోపవాదాలు, విచారణలు జరిపి న్యాయబద్ధమైన తీర్పులు ఇస్తున్నారు. భూ యజమానులకు ఎంతోకొంత ఉపశమనం, భరోసా వుంది. కాని నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం ప్రకారం కోర్టులకు సంబంధం లేకండా చట్టంలో పేర్కొన్నారు. భూ హక్కుకు సంబంధించిన సమస్యలను కోర్టుకు వెళ్ళి పరిష్కరించుకొనే హక్కును హరిస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమైన అంశం. న్యాయ వ్యవస్థకు సంబంధం లేకుండా చేయడం అంటే భూ హక్కుదార్లను భూమి నుండి దూరం చేయడమే. న్యాయస్థానం ప్రాధాన్యతను పూర్తిగా తొలగించింది.

కొత్తగా ఎ.పి ల్యాండ్ టైటిల్ చట్టం ద్వారా తీసుకొచ్చిన పద్ధతి కన్‌క్లూజివ్ టైటిల్ పద్ధతి. ఇదే తుది రికార్డు అని ఈ చట్టం చెబుతుంది. ప్రభుత్వం ఇచ్చిన భూమి హక్కుకు ఇబ్బంది వస్తే ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ఇస్తుందని చట్టంలో పేర్కొన్నారు. భూమికి సంబంధించి ఏ చిన్న సమస్య వచ్చినా భూ యజమాని తరపున ప్రభుత్వం వకాల్తా పుచ్చుకొని వివాదాలు పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. ఇది సాధ్యమా? సదరు భూమిని భూ హక్కుదార్లు తప్ప ఎవరూ క్రయవిక్రయాలు జరపలేరన్నది ప్రభుత్వ వాదన. ఈ చట్టం ప్రకారం రెవిన్యూ డిపార్టుమెంట్ కీలకమైనది. మొదట భూమి సర్వే గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ (జిపిఎస్) ద్వారా సర్వే చేయాలి. భూమి సర్వేకు సంబంధించి ఏ రైతులయితే ఆ భూమిలో వున్నారో వారికి నోటీసుల జారీ చేయాలి. ఒక నోటీస్ తన దగ్గర పెట్టుకోవాలి. సర్వే అయిన తరువాత భూ యజమాని సర్వే రిపోర్టుపై సంతృప్తి వ్యక్తం చేయాలి. డిప్యూటీ తహశీల్దార్ పర్యవేక్షణలో నిర్వహించాలి. సర్వే పూర్తి అయిన తరువాత జాయింట్ కలెక్టర్ ఆన్‌లైన్లో లాగిన్ అవ్వాలి. రాష్ట్ర రికార్డులతో అనుసంధానం అవుతుంది. రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలను పునర్ వ్యవస్థీకరించాలి. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ల్యాండ్ టైటిల్ అథారిటీలను ఏర్పాటు చేయాలి. దీనికి రాష్ట్రంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నియమించి రెవిన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. ప్రతి గ్రామంలో రెవిన్యూ రికార్డులు సవరించాలి. మొత్తం స్థిరాస్తులకు 1. శాశ్వత రిజిస్టర్, 2. వివాదాల రిజిస్టర్, 3. కొనుగోలు రిజిస్టర్ ఇలా మూడు రిజిస్టర్లు ఉంటాయి. ఈ రిజిస్టర్‌పై ఎవరికైనా అభ్యంతరాలుంటే సదరు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలి. ఒకవేళ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు మీద అభ్యంతరాలుంటే కింది కోర్టులకు కాకుండా హైకోర్టులో రివిజన్ వేసుకొనే అవకాశం మాత్రమే ఈ చట్టం కల్పిస్తుంది. దీనివలన చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం వుంది. రాష్ట్ర ప్రభుత్వం 2023 అక్టోబర్ 15 నాటికి 25 లక్షల 2 వేల ఎకరాలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ నేటికి మూడు లక్షల ఎకరాలు మాత్రమే భూ సర్వే అయ్యింది. సర్వేలు చేసిన చోట భూమి ఎక్కువ తక్కువ చూపిస్తున్నారు. పాత పట్టాదారు పాసుబుక్కులో ఉన్న భూమి విస్తరణకు కొత్తగా సర్వే చేసిన వాటికి వ్యత్యాసాలు ఉన్నాయి. భూ హక్కుదార్ల మధ్య వివాదాలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ సర్వేలు సక్రమంగా జరగాలంటే సర్వే అండ్ సెటిల్మెంట్‌కు పూర్తి స్థాయి విభాగం నెలకొల్పాలి. ఈ చట్టం ప్రకారం భూ యజమాని తరపున ప్రభుత్వమే వాదిస్తుందని చెబుతున్నారు. కాని గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఢిపారం పట్టాలు ఇచ్చారు. అమ్మకాలు, కొనుగోలు చేయడం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగానే 9/77 చట్టం తీసుకొచ్చారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు కూడా చేసి వుంది. కాని నేడు ఢిపారం భూములు కొనుగోలు అమ్మకాలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేయవచ్చని నేడున్న ప్రభుత్వం చెబుతుంది. మరో వైపు డిఫారం భూములు ప్రభుత్వానివని, మేము ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని నోటీసులు ఇచ్చి భూములు స్వాధీనం చేసుకుంటున్నారు. విశాఖపట్నంలో 6116 ఎకరాల ఢిపారం భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని విఎంఆర్‌డిఎ కి ల్యాండ్ పూలింగ్ పేరుతో కట్టబెట్టింది. ఇది అన్యాయమని పేదలు హైకోర్టును ఆశ్రయించారు. పేదల తరపున న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. నేడు ఈ కొత్త చట్టం ప్రకారం న్యాయ స్థానాలను ఆశ్రయించవద్దంటే సహజ న్యాయ సూత్రాలకు భిన్నమైనది. సివిల్ కోర్టు పరిధి నుండి తొలగించి అథారిటీ తీర్పును ఫైనల్ చేయడం, టైటిల్ డిక్లరేషన్లో ఎటువంటి చట్టబద్ధమైన విచారణ లేకపోవడం, ఈ చట్టం సివిల్ ప్రొసీజర్ కోడ్ పరిధిలో లేకపోవడం కేవలం పబ్లికేషన్లు మాత్రమే టైటిల్‌ను నిర్ణయించడం ప్రమాదకరం.

మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలు జమీందారీ ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతాలలో దాదాపు 70 సంవత్సరాల క్రితం సమగ్ర సర్వే నిర్వహించారు. రాయలసీమ ప్రాంతంలో రైతువారీ పద్ధతిని థామస్ మన్రో చొరవతో ఈస్ట్ ఇండియా కంపెనీ బ్రిటీష్ వారు ఏర్పాటు చేసిన స్టాండింగ్ ఆపరేషన్ ప్రొసీడింగ్స్ (ఎస్‌ఒపి) ప్రకారం ప్రతి 40 సంవత్సరాలకు ఒకసారి సమగ్రమైన సర్వే సెటిల్మెంట్ జరపాల్సి ఉంది. భూశిస్తు ఆదాయం సరిపోకపోవడంతో ఏ ప్రభుత్వం కూడా ఖర్చు పెట్టి సర్వేలు చేయడానికి ముందుకు రాలేదు. నేడున్న ప్రభుత్వం సైతం నిధులు కేటాయించకుండా ప్రత్యేక యంత్రాంగం సమగ్ర సర్వే నిర్వహించలేదు. సంవత్సరాల తరబడి జరగాల్సిన సర్వేలు రోజులలో నిర్వహించి ఫలితాలు సాధించడం సాధ్యమేనా?

భూమి అనేది కీలకమైన అంశం. దాని చుట్టూ ఆర్థిక, రాజకీయ, సామాజిక సంబంధాలు ముడిపడి ఉంటాయి. ఇంత ముఖ్యమైన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తేలికగా తీసుకుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే భూ వివాదాలు ఒక్క హైకోర్టు తప్ప... కింది స్థాయి కోర్టులను ఆశ్రయించి సివిల్ కేసులు దాఖలు చేయడానికి వీలు లేదు. వీటి స్థానంలో ప్రతి జిల్లా కేంద్రంలో జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారితో ఒక ట్రిబునల్ ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో మొత్తం 26 ట్రిబునళ్లు ఏర్పాటు చేస్తారు. ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో 563 కోర్టులలో భూ వివాదాల పరిష్కరించలేనివి...26 ట్రిబ్యునళ్లలో ఎలా పరిష్కరిస్తారో ప్రభుత్వమే చెప్పాలి.

ఇప్పటి వరకు కార్పొరేట్ కంపెనీలకు భూములు కావాలంటే భూ యజమానుల దగ్గర నుండి ఎపిఐఐసి భూములను సేకరిస్తుంది. ఈ భూ సేకరణలో నష్టపోయిన వారు కోర్టులకెళ్లి న్యాయం పొందుతున్నారు. నేడు ఈ చట్టం అమల్లోకి వస్తే రైతులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కార్పొరేట్ శక్తులకు భూములు ధారాదత్తం చేయవచ్చు. ఈ చట్టం ప్రకారం దీనినెవరూ కోర్టుకెళ్లి సవాలు చేసి న్యాయం పొందే అవకాశం లేదు. కార్పొరేట్ కంపెనీల అవసరాలకు భూములకు కేటాయింపులు చేస్తారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆంధ్ర రాష్ట్రం ఎర్ర తివాచీ పరిచినట్లే. ప్రపంచంలో అనేక దేశాలలో భూ యాజమాన్యాలలో అనేక మార్పులు చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో 'టోరెన్స్ సిస్టమ్' పేరుతో టైటిల్ గ్యారెంటీ పద్ధతి అమలులో ఉంది. వేలాది ఎకరాలు కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం అవుతున్నాయి. మన వంటి పేద దేశాలకు, రాష్ట్రాలకు ఈ చట్టం సరైనది కాదు. మన రాష్ట్రంలో ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులున్నారు. ఇన్ని రకాల రికార్డులు వుంటేనే ప్రజలకు న్యాయం జరగడంలేదు. అలాంటిది ఇప్పుడు కొత్త చట్టం అమలైతే భూముల నుండి శాశ్వతంగా దూరమయ్యే ప్రమాదం వుంది. ఈ ప్రమాదాన్ని న్యాయవాదులు గుర్తించి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రజలు కూడా ల్యాండ్ టైటిల్ యాక్టు ప్రమాదకరమని గుర్తించారు. ప్రభుత్వం వెంటనే ల్యాండ్ టైటిల్ చట్టాన్ని పున:పరిశీలించాలి.

**/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /**


# విద్వేష విషబీజం 'రజాకార్'

సమీక్ష



ఎస్. వీరయ్య

**ఖాసిం రజ్వీ నాయకత్వంలో ఏర్పడిన రజాకార్ మూకలను కూడా భూస్వాములు స్వాగతించారు. తమ గడీలలో ఆశ్రయమిచ్చి గ్రామపేదల మీద ఎగదోశారు. ఇక్కడ రజాకార్లు ముస్లింలు. వారిని పేద రైతాంగం మీద ఎగదోసి దాడులు చేయించిన భూస్వాములు హిందువులు. రజాకార్ సంస్థకు అధ్యక్షుడు ఖాసీం రజ్వీ కాగా, ఉపాధ్యక్షుడు విసునూరు రామచంద్రారెడ్డి. భూస్వామిని ప్రశ్నించినందుకు బందగి (ముస్లిం) హత్యకు గురయ్యాడు. హత్య చేయించిన భూస్వామి హిందువు. భూస్వామికి అండగా నిలిచినది నిజాం ప్రభుత్వం. నిజాం రాచరికాన్ని, దౌర్జన్యాలను ఎండగట్టిన పాత్రికేయుడు షోయబుల్లాఖాన్. ఆయనను హత్య చేసింది రజాకార్ మూకలు. భూస్వాముల దోపిడీ మీద, నిజాం దౌర్జన్యాల మీద యుద్ధం ప్రకటించిన కవీ కమ్యూనిస్టు నేత మఖ్దూం మొహియుద్దీన్. ఈ మొత్తం పోరాటానికి నాయకత్వం వహించిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. వీరోచిత పాత్ర పోషించిన నేతలు రావి నారాయణ రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి నాయకులెందరెందరో. నాలుగువేల మంది ఎర్రజెండా యోధులు ప్రాణాలర్పించిన వీరగాథ. ఇక్కడ హిందూ-ముస్లిం సమస్య ఎక్కడిది? కానీ రజాకార్ సినిమాలో ఈ పోరాటానికి మతం రంగు పులిమారు. మత మార్పిడులకు, తుర్కిస్తాన్ ఏర్పాటు ప్రయత్నాలకు వ్యతిరేకంగా సాగిన మత కొట్లాటగా చిత్రీకరించారు. చరిత్రను దారుణంగా వక్రీకరించారు.**




'రజాకార్' సినిమా ఇప్పుడే ఎందుకు విడుదలైంది? ఏడాది కిందనే ఈ సినిమా రాబోతున్నదనీ, కాచుకోండనీ బండి సంజయ్ సవాలు విసిరాడు కదా! ఆయనే ఇప్పుడు పన్ను రాయితీ అడుగుతున్నారు. కారణం ఏమిటి? అసలు చరిత్రలో ఏం జరిగింది? మార్చి 12న కేంద్ర ప్రభుత్వం 'సెప్టెంబర్ 17' విమోచనదినంగా జరుపుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. 15వ తేదీన 'రజాకార్' సినిమా విడుదలైంది. 16వ తేదీన ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు ప్రకటించింది. 15-16 తేదీలలోనే ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణలో పర్యటించారు. వీటి మధ్య సంబంధం ఏమిటి? ఇవన్నీ సమాధానం వెతకాల్సిన ప్రశ్నలే.

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో 1946 నుంచి 1951 వరకు సాగిన చారిత్రాత్మక పోరాటం. హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీనం కాక తప్పని పరిస్థితి సృష్టించిన మహోద్యమం. అయినా సినిమాలో ఎక్కడా ఎర్రజెండా కనిపించదు. అనేక సంస్థలతో పాటు కమ్యూనిస్టు పార్టీ కూడా పోరాడుతున్నదని ఒక సందర్భంలో భారత ప్రభుత్వంలో హోంమంత్రి సర్దార్ పటేల్‌కు మున్షీ చెప్పినట్టు మాత్రం చూపించారు. విలీనం సమయంలో కమ్యూనిస్టులు మెల్లగా తప్పుకున్నారని అబద్ధాలు చెప్పారు. పోరాటం మొదలైంది జమీందార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన పోరాటం, భూస్వామ్య వ్యవస్థ మీద తిరుగుబాటుగా మారింది. రైతాంగమే కాదు, సమస్త కుల వృత్తుల వారు భూస్వాములకు వెట్టి చాకిరీ చేయాలి. తమ ఉత్పత్తులను ఉచితంగా ఇవ్వాలి. అందుకే హిందూ, ముస్లిం తేడా లేకుండా గ్రామాలకు గ్రామాలే తిరుగుబాటు బావుటా ఎగురవేశాయి. దొరల గడీల మీద యుద్ధం ప్రకటించారు. వెట్టిచాకిరీ మీద ప్రతిఘటనగా మొదలై దున్నేవాడికే భూమి కోసం సాగింది. రైతాంగం సాధించిన భూమి, ఇతర హక్కుల రక్షణ కోసం క్రమంగా నిజాం రాచరికాన్నే సవాలు చేసింది. హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీనమైన తర్వాత కూడా పోరాటం కొనసాగించాల్సి వచ్చింది. 1951 అక్టోబర్‌లో ఆనాటి నెహ్రూ ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం మేరకు పోరాట విరమణ జరిగింది. పదిలక్షల ఎకరాల భూమి పేదలకు పంచింది ఈ పోరాటం. వృత్తిదారులకు రక్షణ కల్పించింది. మూడువేలకు పైగా గ్రామరాజ్యాలు ఏర్పాటు చేసింది. కనీస వేతనాలు గ్యారంటీ చేసింది. స్త్రీ పురుషులకు సమాన హక్కులు ప్రకటించింది. కుల వివక్షను నిషేధించింది. గ్రామాల మీద భూస్వాముల పెత్తనాన్ని, నిజాం రాజు ఆధిపత్యాన్ని తిరస్కరించింది. ఇంతటి భూపోరాటంలో ఐలమ్మ పోరాటం పేరుతో ఒక ఘటనగా మాత్రం చూపించి, మొత్తం పోరాట స్వభావాన్ని వక్రీకరించారు. కొత్త తరాలకు ఈ సినిమాలో చూపించిందే చరిత్రగా తప్పుదారి పట్టించారు. చివరకు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా 1836-60 కాలంలో జరిగిన రాంజీ గోండు తిరుగుబాటును కూడా నిజాం వ్యతిరేక పోరాటంతో అతికించారు.

భూస్వాములు, జమీందార్లూ, జాగీర్దార్ల మీద ఆధారపడి సాగుతున్న నిజాం రాజ్యం, ఈ పెత్తందార్ల అధికారానికే ముప్పు ఏర్పడడాన్ని సహించలేక పోయింది. తన సైన్యాన్ని దొరలకు మద్దతుగా పంపింది. ఖాసిం రజ్వీ నాయకత్వంలో ఏర్పడిన రజాకార్ మూకలను కూడా భూస్వాములు స్వాగతించారు. తమ గడీలలో ఆశ్రయమిచ్చి గ్రామపేదల మీద ఎగదోశారు. ఇక్కడ రజాకార్లు ముస్లింలు. వారిని పేద రైతాంగం మీద ఎగదోసి దాడులు చేయించిన భూస్వాములు హిందువులు. రజాకార్ సంస్థకు అధ్యక్షుడు ఖాసీం రజ్వీ కాగా, ఉపాధ్యక్షుడు విసునూరు రామచంద్రారెడ్డి. భూస్వామిని ప్రశ్నించినందుకు బందగి (ముస్లిం) హత్యకు గురయ్యాడు. హత్య చేయించిన భూస్వామి హిందువు. భూస్వామికి అండగా నిలిచినది నిజాం ప్రభుత్వం. నిజాం రాచరికాన్ని, దౌర్జన్యాలను ఎండగట్టిన పాత్రికేయుడు షోయబుల్లాఖాన్. ఆయనను హత్య చేసింది రజాకార్ మూకలు. భూస్వాముల దోపిడీ మీద, నిజాం దౌర్జన్యాల మీద యుద్ధం ప్రకటించిన కవీ కమ్యూనిస్టు నేత మఖ్దూం మొహియుద్దీన్. ఈ మొత్తం పోరాటానికి నాయకత్వం వహించిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. వీరోచిత పాత్ర పోషించిన నేతలు రావి నారాయణ రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి నాయకులెందరెందరో. నాలుగు వేల మంది ఎర్రజెండా యోధులు ప్రాణాలర్పించిన వీరగాథ. ఇక్కడ హిందూ-ముస్లిం సమస్య ఎక్కడిది? కానీ రజాకార్ సినిమాలో ఈ పోరాటానికి మతం రంగు పులిమారు. మత మార్పిడులకు, తుర్కిస్తాన్ ఏర్పాటు ప్రయత్నాలకు వ్యతిరేకంగా సాగిన మతకొట్లాటగా చిత్రీకరించారు. చరిత్రను దారుణంగా వక్రీకరించారు. ఇందుకోసం, నేటి రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ఆవు పాత్రను కూడా సృష్టించారు. రజాకార్ మీద ఆవు దాడి చేసినట్టు చూపించి, హిందువులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాల నుంచి రజాకార్ మూకల దాడులను వేరుచేసి చూపారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కనుగుణంగా చరిత్రను వక్రీకరించేందుకు వాడుకున్నారు.

జాతీయ జెండా పూని ప్రజలు తిరుగుబాటు చేసినట్టు చూపించారు. దీనికి స్టేట్ కాంగ్రెస్ పేరు వాడుకున్నారు. సంస్థానాలలో పోరాటం చేయవద్దని ఆనాటి కాంగ్రెస్ పార్టీ నిర్ణయం. అందువల్ల కొందరు స్టేట్ కాంగ్రెస్‌గా ప్రకటించుకున్నప్పటికీ, ఈ పోరాటంతో వారికి సంబంధం లేదు. విడిగా వారు పోరాడిందీ లేదు. కానీ నేటి తరం భావోద్వేగాలను తప్పుదారి పట్టించేందుకు పెద్ద స్థూపం రూపంలో, త్రివర్ణ పతాకం ఎగురవేసేందుకు చేసిన ప్రయత్నంగా, దానిమీద రజాకార్లు దాడి చేసినట్టుగా నాటకీయంగా చిత్రీకరించారు. స్టేట్ కాంగ్రెస్ ఏనాడూ రజాకార్లతో ఘర్షణ పడ్డ దాఖలాల్లేవు కదా!

మొదట ఈ పోరాటానికి పునాదులు వేసింది ఆంధ్ర మహాసభ. తెలుగు భాష అభివృద్ధి కోసం, గ్రంథాలయోద్యమం నడిపింది. సాంస్కృతికోద్యమానికి నాయకత్వం వహించింది. ఇందులోనుంచే ఎర్రజెండా ఉద్యమం ఆవిర్భవించింది. భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ రూపంలో పోరాటం ఆరంభమైంది. కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో సాయుధ పోరాటంగా మారింది. కానీ ఎక్కడో ఒక మాటమాత్రంగానే ఆంధ్ర మహాసభను ప్రస్తావించారు. కమ్యూనిస్టులు, ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజ్, వందేమాతరం, స్టేట్ కాంగ్రెస్, తదితర సంస్థల ఆధ్వర్యంలో పోరాటం జరిగినట్టు ప్రస్తావించారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలను సాయుధ రైతాంగ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని సంస్థలను ఒకే గాటన కట్టారు. నాయకులు, తేదీలు, ప్రాంతాల పేర్లు వాడుకుని వాస్తవ చరిత్రను వక్రీకరించారు.

హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీన క్రమాన్ని పూర్తిగా వక్రీకరించారు. ఇందుకోసం ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అవమానించేందుకూ వెనుకాడలేదు. యూనియన్ సైన్యాలను నిజాం రాజు ప్రతిఘటించినట్టు అభూత కల్పనలు చిత్రీకరించారు. నిజానికి నిజాం రాజు అసలు ఇండియన్ సైన్యాలతో పోరాడనే లేదు. చేతులెత్తేశాడు. సాయుధ రైతాంగం తిరుగుబాటుతో నిజాం రాజు సింహాసనం కదులుతున్న దశలో, పటేల్ సైన్యాల శరణు కోరాడు. సెప్టెంబరు 13న యూనియన్ సైన్యాలు రావటం, 17న విలీనానికి నిజాం రాజు మిర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రకటన చేయటం చకచకా జరిగిపోయింది. ఇక్కడ 13వ తేదీకి గుజరాత్ సెంటిమెంట్ జోడించారు. అనేక రాజ్యాలను ఆక్రమించి, బ్రిటిష్ ఇండియాగా ప్రకటించుకుని తెల్ల దొరలు రాజ్యమేలిన విషయం చారిత్రక సత్యం. బ్రిటిష్ ఇండియాలో కూడా జాతీయ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ, ముస్లిం లీగ్‌ల నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం సాగింది. అనేక ఇతర సంస్థలు, వ్యక్తులు, సమరయోధులు తోడయ్యారు. స్వాతంత్ర్యం సిద్ధించే సమయానికి స్వతంత్ర, సామంత రాజ్యాలుగా ఉన్న 565 సంస్థానాల గురించి కూడా ఒప్పందం జరిగింది. ఆమేరకే కొన్ని ఇండియన్ యూనియన్‌లో, మరికొన్ని పాకిస్తాన్‌లో విలీనం కాగా, హైదరాబాద్, జమ్ము కాశ్మీర్, జునాగఢ్ సంస్థానాలు స్వతంత్ర రాజ్యాలుగానే ప్రకటించుకున్నాయి. జునాగఢ్ ప్రజల తిరుగుబాటుతో ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ఇండియాలో విలీనమైంది. జమ్ము కాశ్మీర్ రాజు ఒకవైపు షేక్ అబ్దుల్లా నాయకత్వంలోని ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న కాశ్మీరీల పోరాటం, మరోవైపు పాక్ సైన్యాల చొరబాటుతో దిక్కులేక, జమ్ము, కాశ్మీర్ రాజు, తన సంస్థానాన్ని కొన్ని షరతులతో ఇండియాలో విలీనం చేసి, ఇండియన్ సైన్యాల సహాయం కోరాడు. హైదరాబాద్ రాజ్యంతో భారత ప్రభుత్వం యథాతథ ఒప్పందం చేసుకున్నది. కమ్యూనిస్టుల నాయకత్వంలోని పోరాటంతో నిజాం రాజ్యం కూలిపోయే దశలో మాత్రమే ఎర్రజెండా పోరాటాన్ని అణచేందుకు, భూస్వాములను రక్షించేందుకు పటేల్ సైన్యాలు ప్రవేశించి, నిజాం రాజుతో రాజీ కుదుర్చుకున్నాయి. ఏ నిజాం రాజ్యం మీద ప్రజలు తిరుగుబాటు చేశారో ఆ రాజైన మిర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ఖైదు చేయాల్సింది పోయి, హైదరాబాద్ స్టేట్‌కు రాజప్రముఖ్‌గా నియమించి గౌరవించారు. విలీనం చేసినందుకు కోట్ల విలువ చేసే సంపద ముట్టజెప్పారు. మరోవైపు నరహంతక ఖాసిం రజ్వీకి మరణశిక్ష వేయాలని ప్రజలు కోరుతుంటే, సకల మర్యాదలతో పాకిస్తాన్ పంపించి రక్షించారు. రైతులు దున్నుకుంటున్న భూములు గుంజుకుని భూస్వాములకు అప్పగించారు. అడ్డుకున్న రైతులను 2500 మందిని పటేల్ సైన్యాలు పొట్టన బెట్టుకున్నాయి. పటేల్ సైన్యాలు నిజాం రాజును బంధించి, పోరాడుతున్న ప్రజల హక్కులు కాపాడుతాయని నమ్మిన తెలంగాణ రైతాంగాన్ని మోసం చేశాయి. దానితో హక్కుల కోసం పోరాటం కొనసాగించక తప్పలేదు. ఇదీ చరిత్ర.

బ్రిటిష్ ఇండియాలో జరిగింది స్వాతంత్ర్య పోరాటం. తెలంగాణ ఆనాడు బ్రిటిష్ ఇండియాలో లేదు. ఇక్కడ జరిగింది భూస్వాముల మీద, రాచరికం మీద పోరాటం. దీనిని కూడా వక్రీకరించి స్వతంత్ర పోరాటంగా చిత్రీకరించారు. మతం రంగు పులిమి ముస్లింల నుంచి హిందువుల విముక్తిగా చిత్రీకరించారు. దీనికే మోడీ ప్రభుత్వం 'విమోచన దినం'గా పేరు పెట్టింది. వాస్తవానికి విలీనం జరిగింది. భూస్వామ్య దోపిడీ నుంచి విముక్తి జరగనే లేదు. 565 సంస్థానాలు కలవకపోతే భారతదేశం 565 ముక్కలయ్యేదని, అఖండ భారత్ ఏమయ్యేదని సర్దార్ పటేల్ అన్నట్టుగా చూపించి పటేల్ పరువు తీశారు. ఇప్పుడున్న బిజెపి నేతలకు, ఆర్‌ఎస్‌ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంతో అణువంత సంబంధం లేదు. కానీ స్వాతంత్ర్యోద్యమంలో ఉన్న కాంగ్రెస్ నేత సర్దార్ పటేల్. బ్రిటిష్ ఇండియాకు, 565 సంస్థానాలకు సంబంధం లేదని వారికి బాగా తెలుసు. వాటిని ఇండియాలో విలీనం చేయటమే ఆనాటి సమస్య. అనేక రాజ్యాలు, భాషలు, సంస్కృతుల సమాహారంగా ఏర్పడింది కాబట్టే దీనిని 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అన్నారు.

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందటం కోసం బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వారు 'రజాకార్' పేరుతో చరిత్రను వక్రీకరించి సినిమా తీశారు. దీనికి ముందు 'కాశ్మీర్ ఫైల్స్', 'కేరళ స్టోరీ' పేరుతో కూడా ఇలాంటి ప్రయత్నమే చేశారు. గొప్ప నటీనటులను, రచయితలను, దర్శకులను, నైపుణ్యం వున్న సిబ్బందిని...ప్రజా ప్రయోజనాలకు హాని చేసే సినిమాను రూపొందించేందుకు...ప్రమోషన్ కోసం...సమర్థవంతంగా వాడుకున్నారు.

**/ వ్యాసకర్త సిపియం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /**

## నిందితులు ఎప్పటికీ జైల్లోనే ఉండాలా ?

- ఇడిని ప్రశ్నించిన సుప్రీం

**న్యూఢిల్లీ :** మనీ లాండరింగ్ కేసుల్లో విచారణకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అనుసరిస్తోన్న తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర విచారం వ్యక్తం చేసింది. నిందితులకు డీఫాల్ట్ బెయిల్ నిరాకరించేందుకు వరుసగా అనుబంధ ఛార్జ్‌షీట్లు దాఖలు చేయడాన్ని ప్రశ్నించింది. నిందితుడిని అరెస్టు చేసినప్పుడే విచారణ మొదలు కావాలని స్పష్టం చేసింది. విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైల్లోనే ఉంచడానికే ఇడి ఈ పద్ధతిని అనుసరిస్తుందని విమర్శించింది. ప్రస్తుత కేసులో ఒక వ్యక్తి 18 నెలలపాటు జైల్లోనే ఉన్నాడని, ఇది తమనెంతో ఇబ్బందికి గురిచేస్తోందని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. అయితే, సుప్రీంకోర్టు ఇలాంటి అభిప్రాయాన్ని గతంలోనూ వ్యక్తంచేసింది. దర్యాప్తు పూర్తిచేయకుండా, నిందితుడికి డీఫాల్ట్ బెయిల్ నిరాకరించే ఉద్దేశంతో వరుస ఛార్జిషీట్‌లు దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. అయినా ఇడి అదేవిధంగా వ్యవహరిస్తుంది.

## ఇసిలపై కావాలనే వివాదం

- సుప్రీంలో కేంద్రం అఫిడవిట్

**న్యూఢిల్లీ :** నూతన ఎన్నికల కమిషనర్లుగా (ఇసి)గా మాజీ ఉన్నతాధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధు నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంది. ఈ అంశంపై పిటీషనర్లు కావాలనే వివాదం సృష్టిస్తున్నారని విమర్శించింది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. భారత ఎన్నికల సంఘం(ఇసిఐ)లో ఖాళీ అయిన రెండు పోస్టుల భర్తీ ఎంపిక కమిటీలో సిజెఐ మినహాయించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలయ్యాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం పై విధంగా స్పందించింది. ఆ ఇద్దరు కమిషనర్ల యోగ్యత, అర్హతపై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం కాలేదని ప్రస్తావించింది. . తమ అభ్యంతరాలను సమర్పించడంలో వారు విఫలమయ్యారని పేర్కొంది. దీని ఆధారంగా ఈ పిటీషన్లను కొట్టివేయాలని కోర్టును కోరింది.సుప్రీంకోర్టు విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## కాంగ్రెస్‌లో చేరిన బిజెపి ఎమ్మెల్యే

**రాంచీ:** జార్ఖండ్ బిజెపి ఎమ్మెల్యే జైప్రకాష్ భాయ్ పటేల్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.పటేల్ హజారీబాగ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకు ముందు ఆయన జార్ఖండ్ ముక్తి మోర్చా ఎమ్మెల్యేగా ఉన్నారు.జార్ఖండ్ కోసం తన తండ్రి మాజీ ఎంపీ టెక్‌లాల్ మహతో కలను నెరవేర్చుకోవాలనుకున్నానని, అందుకే ఎన్డీయేను వీడి కాంగ్రెస్‌లో చేరానని, ఇండియా బ్లాక్‌ను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

## కాంగ్రెస్‌లో జాప్ విలీనం

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలకు కొన్ని రోజులకు ముందే పప్పూయాదవ్ బుధవారం తన జన్ అధికార్ పార్టీ (జాప్)ను కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఈ సందర్భంగా పప్పూయాదవ్ మాట్లాడుతూ 'మేము ఈ ఎన్నికల్లో (2024) మాత్రమే కాదు బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ (2025) గెలుస్తాము. బిజెపి ఓటమి, బిసిల అభివృద్ధే మా ధ్యేయం' అనిఅన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంతో కలిసి పోరాడతాం. ప్రజల హృదయాన్ని గెలుచుకున్నవారే ఈ దేశానికి ప్రధాని అవుతారు అని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రజల హృదయాలను గెలుచుకున్నారని అన్నారు.

## అకాల వర్షంతో అవస్థలు

**(మొదటి పేజీ తరువాయి)**

బుధవారం ఉదయం వరకు 136.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

విజయనగరం జిల్లా తెర్లాం మండలం వి.చిన్నయ్యపేట గ్రామంలో పిడుగు పడి 35 గొర్రెలు మృతి చెందాయి.

శ్రీకాకుళం జిల్లాలో రబీ సీజన్‌లో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 38,163 ఎకరాలు కాగా, లక్ష్యానికి మించి 38,768 ఎకరాల్లో వేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎల్ఎన్‌పేట, హిరమండలం, పాతపట్నం, సారవకోట, జలుమూరు మండలాల్లో అధికంగా, ఆమదాలవలస, జి.సిగడాం, నందిగాం, మెళియాపుట్టి ప్రాంతాల్లో పాక్షికంగా పంట దెబ్బతింది.

మొత్తం 1,100 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్టు సమాచారం. ఇందులో కోతలు పూర్తయి, పొలాల్లోనే ఉన్న పంట 700 ఎకరాల వరకు ఉన్నట్టు రైతులు చెప్తున్నారు. కోతలు పూర్తి కాని ప్రాంతాల్లో 400 ఎకరాల్లో పంట నేలకొరిగినట్లు తెలుస్తోంది. జిల్లాకు భారీ వర్షసూచన ఉండడంతో మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కోత కోసి ఆరబెట్టిన పంటలను కళ్లాల్లో ఒక దగ్గరికి చేర్చి టార్పాలిన్లతో కప్పుతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్నకు మంచి ధర లభిస్తోంది. పంట అమ్మితే కొన్ని అప్పులు తీరుద్దామని ఆశించిన రైతులకు అకాల వర్షాలు శరాఘాతమయ్యాయి.

**ఏం చేయాలో పాలుపోవడం లేదు**

నేను 2.5 ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. కోతలు కోసి పొలంలోనే ఆరబెట్టాను. పంటంతా తడిసిపోయింది. అప్పు చేసి లక్ష రూపాయల వరకు ఖర్చు చేశాను. వారం రోజుల కిందట గింజల పరిస్థితి చూసేందుకు వ్యాపారులు వచ్చారు. ఇప్పుడు వర్షానికి గింజలు పూర్తిగా దెబ్బతినడంతో ఇంకెవరు తీసుకుంటారు.

**- విజయ్‌కుమార్ మహాపాత్రో, ఎల్ఎన్‌పేట (శ్రీకాకుళం జిల్లా)**

**ఎకరాకు రూ.80 వేలు నష్టం**

వర్షాల వల్ల నష్టపోయాము. ఏటా ఈ ప్రాంతంలో సారి కంద వేస్తాము. మొక్కజొన్నకు ధర బాగుందని ఈ సంవత్సరం చాలామందిమి ఈ పంట వైపు మొగ్గు చూపాము. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక క్వింటాలు రూ.2 వేలు ధర పలుకుతోంది. ఈ ఏడాది ఎకరాకు 40 క్వింటాల వరకు దిగుబడి వచ్చింది. అకాల వర్షాల వల్ల ఎకరాకు రూ.80 వేల చొప్పున నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

**- వి.తిరుమలరావు, ఎల్ఎన్‌పేట (శ్రీకాకుళం జిల్లా)**

# ఒక్క శాతం మంది చేతుల్లోనే భారత్

- వారి గుప్పిటలోనే ఆదాయం, సంపద
- హామీలు విస్మరించిన బిజెపి
- దేశంలో నిరంకుశ పాలన
- ఆదాయ అసమానతలు అధికం
- వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ నివేదిక



**న్యూఢిల్లీ :** భారత జాతీయ ఆదాయంలో ఎక్కువ భాగం కేవలం 1 శాతం ప్రజల చేతిలోనే ఉండిపోతోంది. అమెరికా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో పోలిస్తే జాతీయ ఆదాయంలో వీరి వాటాయే ఎక్కువ. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ తాజాగా ప్రచురించిన నివేదిక ప్రకారం 2014-15, 2022-23 మధ్యకాలంలో దేశంలో సంపదకు సంబంధించి ఆదాయ అసమానతలు అధికంగా ఉన్నాయి. ఆర్థికవేత్తలు నితిన్ కుమార్ భారతి, లూకస్ ఛాన్సెల్, థామస్ పికెట్టి, అన్మోల్ సోమంచి ఈ నివేదికను రూపొందించారు.

ఈ నివేదిక ప్రకారం...అత్యంత సంపన్నులైన 1% జనాభా యొక్క ఆదాయం, సంపద వాటాలు రికార్డు స్థాయిల్లో ఉన్నాయి. 2022-23లో దేశ ఆదాయంలో 22.6%, సంపదలో 40.1% వీరి వద్దే ఉంది. వీరి సంపద వాటా 1961 తర్వాత ఈ స్థాయిలో ఉండడం ఇదే మొదటిసారి. ఆదాయాలు, సంపదలు కొద్ది మంది వద్దే పోగుపడి ఉండడం సమాజం, ప్రభుత్వంపై ప్రభావం చూపుతుంది. ఇటీవలి సంవత్సరాలలో దేశంలో కీలకమైన సంస్థలు వీరి వద్ద రాజీ పడిపోయాయి.

2014లో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత గత దశాబ్ద కాలంలో అనేక ప్రధాన రాజకీయ, ఆర్థిక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 'దేశాన్ని అభివృద్ధి చేస్తామని, ఆర్థిక సంస్కరణలు చేపడతామనే హామీతో బిజెపి అధికారంలోకి వచ్చింది. వరుసగా రెండుసార్లు దేశాన్ని పాలించింది. అయితే ఈ కాలంలో నిర్ణయాలు తీసుకునే అధికారం ఒకే వ్యక్తి చేతిలో కేంద్రీకృతమైంది. ఫలితంగా అది నిరంకుశ పాలనకు దారితీసింది. బడా వ్యాపారవేత్తలు, ప్రభుత్వం మధ్య సంబంధాలు పెరిగిపోతున్నాయి' అని ఆ నివేదిక వివరించింది.

ఫోర్బ్స్ బిలియనీర్ ర్యాంకింగులను ఈ నివేదిక ఉటంకించింది. సుమారు రూ.100 కోట్ల కంటే నికర సంపద ఎక్కువగా ఉన్న భారతీయులు 1991లో ఒక్కరు మాత్రమే ఉండగా 2022 నాటికి వారి సంఖ్య 162కు పెరిగింది. ఇదే కాలంలో ఈ వ్యక్తుల మొత్తం నికర సంపద దేశ నికర జాతీయాదాయంలో 1% నుండి 25%కి పెరిగింది. ఆదాయం, సంపదను లెక్కించడానికి దేశంలో పన్ను వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉన్నదని నివేదిక అభిప్రాయపడింది. ఆరోగ్యం, విద్య, పోషకాహారం వంటి విషయాలలో ప్రభుత్వ పెట్టుబడులు సగటు భారతీయుల కోసమే ఉండాలి తప్పించి సంపన్నుల కోసం కాదని స్పష్టం చేసింది. భారత్‌లో ఆర్థిక సమాచారం నాణ్యత పేలవంగా ఉన్నదని, ఇటీవలి కాలంలో అది పడిపోతోందని నివేదిక తెలిపింది. అధికారిక సమాచారం మరింతగా అందుబాటులో ఉండాలని, అసమానతలపై అధ్యయనం పెంచడంలో పారదర్శకత అవసరమని, ప్రజల మధ్య జరిగే చర్చల్లో ఆధారాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నివేదిక సూచించింది.

## 21 మందితో డిఎంకె జాబితా

- మేనిఫెస్టో విడుదల




**చెన్నై :** తమిళనాడులో అధికార డిఎంకె పార్టీ బుధవారం 21 మందితో లోక్‌సభ ఎన్నికల కోసం అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. అలాగే ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తొలి దశలోనే తమిళనాడులోని మొత్తం 39 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. 39 స్థానాలకు గాను డిఎంకె 21 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. సీట్ల ఒప్పందంలో భాగంగా మిగిలిన 18 స్థానాల్లో కాంగ్రెస్, వామపక్షాలు, విసికె తదితర మిత్రపక్షాలు పోటీ చేయనున్నాయి.

డిఎంకె నుండి బరిలోకి దిగనున్న 21 మందిలో 11 మంది కొత్తవారు ఉండగా, దక్షిణ చెన్నై సిట్టింగ్ ఎంపి తమిజాచి తంగపాండియన్ సహా ముగ్గురు మహిళలు ఉన్నారు. సిట్టింగ్ ఎంపిలు కనిమొళి, టి.ఆర్ బాలు, ఎ.రాజా సహా దయానిధి మారన్, ఎస్.జగద్రక్షకన్, కళానిధి వీరసామి, కథిర్ ఆనంద్, సి.ఎన్. అన్నాదురైలో పోటీ చేయనున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ.. ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ.500కు తగ్గిస్తామన్నారు. లీటర్ పెట్రోల్ రూ.75కి, డీజిల్ రూ.65కి తగ్గిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. అలాగే 100 రోజుల ఉపాధిని 150 రోజులకు పెంచుతామన్నారు. విద్యార్థుల ఎడ్యుకేషన్ లోన్స్‌ను మాఫీ చేస్తామని, విద్యార్థులకు వడ్డీలేని రూ.4 లక్షల లోన్ ఇస్తామని ప్రకటించారు.

## తొలి విడతకు నోటిఫికేషన్ విడుదల

- నామినేషన్లు ప్రారంభం
- ఈ దశలో 102 లోక్‌సభ స్థానాలు
- సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు
- ఏప్రిల్ 19న పోలింగ్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న లోక్‌సభ తొలి విడత ఎన్నికల కోసం, అదే విధంగా సిక్కిం (32 స్థానాలు), అరుణాచల్ ప్రదేశ్ (60 స్థానాలు) అసెంబ్లీ ఎన్నికల కోసం బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌తో బుధవారం నుంచే నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమయింది. నామినేషన్ దాఖలుకు ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చారు. బీహార్‌లో మాత్రం ఈ నెల 28 వరకు నామినేషన్‌ల దాఖలుకు అవకాశం కల్పించారు. బీహార్‌లో ఈ నెల 30న నామినేషన్‌ల పరిశీలన జరగనుంది. బీహార్ మిగిలిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ నెల 30 నామినేషన్‌ల ఉపసంహరణకు తుది గడువు. బీహార్‌లో నామినేషన్‌ల ఉపసంహరణకు ఏప్రిల్ 2 వరకు అవకాశం ఇచ్చారు. తొలి దశకు ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. తొలి విడతలో 21 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అందులో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు, రాజస్థాన్‌లోని 12 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని 6 స్థానాలు, ఉత్తరాఖండ్, అస్సాం, మహారాష్ట్రల్లోని ఐదేసి స్థానాలు, బీహార్‌లోని నాలుగు స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లోని మూడు స్థానాలు, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాల్లోని రెండేసి స్థానాలు, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్ దీవులు, జమ్మూ కాశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లోని ఒక్కో స్థానం ఉన్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరగనున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్, జూన్ 1న తుది విడత పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

## భువనగిరిలో సిపిఎం పోటీ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో సిపిఎం పార్టీని గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి ఎండి జహంగీర్ ప్రజలను కోరారు. తనకు భువనగిరి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించిన సిపిఎం కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీలకు ముందుగా ఆయన ధన్యవాదాలు చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో జహంగీర్ విలేకరులతో మాట్లాడారు. భువనగిరి చారిత్రక నియోజకవర్గమనీ, సాయుధ రైతాంగ పోరాటం జరిగిందనీ, ఎంతో మంది అమరులయ్యారని గుర్తుచేశారు. త్యాగాలు, చరిత్ర తెలిసిన ప్రాంతమని వివరించారు. సాగునీరు, తాగునీరు, విద్యావైద్యం, కాలుష్యం, మూసీ పరివాహక ప్రాంతం, ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యలున్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై పార్లమెంటులో గళమెత్తే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. పేద కుటుంబం నుంచి వచ్చిన జహంగీర్ 35 ఏండ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్నారనిచెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ప్రజలు వలసపోతున్నారనీ, వాటిని ఆపి ఉపాధి అవకాశాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కరువు బారిన గాజా?

- మే నాటికి ఉత్తర గాజాలో ఆందోళనకర పరిస్థితులు



**గాజా :** గాజాలోని 20లక్షల మంది ప్రజానీకం ఏదొక స్థాయిలో తీవ్రమైన ఆహార అభద్రతను, తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గాజాలో తక్షణమే మానవతా సాయం పెరగకపోయినా, కాల్పుల విరమణ జరగకపోయినా మే నాటికి ఉత్తర గాజా దుర్భిక్షం బారిన పడుతుందని ఇప్పటికే ఐక్యరాజ్య సమితి సంస్థలు హెచ్చరించాయి. పైగా సుదీర్ఘకాలంలో తీవ్ర అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడం ఖాయమని పేర్కొన్నాయి. సూడాన్, ఆఫ్ఘనిస్తాన్‌దేశాల్లో వరుసగా 80, 70శాతం ప్రజలు ఇలాంటి ఆహార సంక్షోభాలను ఎదుర్కొంటుండగా, గాజాలో మాత్రం వంద శాతం ప్రజలు ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అమెరికా కూడా ఈ విషయాన్ని మొదటిసారిగా అంగీకరించింది. తక్షణమే గాజా ప్రజలకు ఆహారాన్ని అందించడమే ప్రథమ ప్రాధాన్యతగా వుండాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ స్పష్టం చేశారు. గాజాలో నెలకొన్న క్షామ పరిస్థితులు పూర్తిగా మానవ తప్పిదాలని, పైగా నివారించదగినవని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ స్పష్టం చేశారు. గాజా ప్రజలకు ఆహారం అందకుండా ఇజ్రాయిల్ విధిస్తున్న ఆంక్షలు యుద్ధ నేరం కిందకే వస్తాయని ఆయన హెచ్చరించారు. గతంలో గాజాలో ఐదేళ్ళలోపు చిన్నారుల్లో 0.8శాతం మంది తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతుండగా, గత కొద్ది నెలలుగా కొనసాగుతున్న దాడుల పర్యవసానంగా ప్రస్తుతం ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 12.4 శాతం నుండి 16.5శాతం మధ్య వుందని ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపిసి) తాజా విశ్లేషణలో వెల్లడైంది. ఆహారం, నీరు, ఇతర నిత్యావసరాల సరఫరా తక్షణమే పెరగని పక్షంలో పరిస్థితులు ఇంకా దిగజారడం ఖాయమని పేర్కొంది. ప్రస్తుతం అనేక కుటుంబాలు రోజువారీ తినడాన్ని మానేయగా, చాలా కుటుంబాల్లో పిల్లలు తినడానికి వీలుగా పెద్దలు తినడం మానేస్తున్న హృదయ విదారక దృశ్యాలు సర్వ సాధారణమైపోయాయి. దీనివల్ల సుదీర్ఘకాలంలో వేలాదిమంది ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకం

**(మొదటి పేజీ తరువాయి)**

జరుగుతున్నాయని, అవి త్వరలోనే ముగుస్తాయని చెప్పారు. 'ఎన్నికల రాజకీయాలు, సీట్ల సర్దుబాట్లు, పొత్తులు అనేవి గణితానికి సంబంధించిన లెక్కలు కావు. ఇవి రాజకీయాలు. రెండు రెండు కలిస్తే నాలుగు కావడం, వాటిని తీసేయడం కాదు. కాబట్టి ఎవరు వెళుతున్నారు, ఎవరు వస్తున్నారన్నది ప్రశ్న కాదు. ఏ విలువలపై ఎవరు చేరుతున్నారన్నదే ఇక్కడ ప్రధానం' అని ఏచూరి వ్యాఖ్యానించారు.

**వినాశకర ఆర్థిక విధానాలే కారణం**

'మీరు ఎన్నికలను ఓ వ్యాపారంగానే భావిస్తే ఫిరాయింపులు లేదా అలాంటివాటి గురించే ఆలోచిస్తారు. అది వేరే విషయం. కానీ అవి రాజకీయాలు కావు' అని ఏచూరి చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజల ముందున్న సమస్యలను ఆయన ప్రస్తావిస్తూ జీవనోపాధే ఇప్పుడు ప్రధాన అంశంగా అందరి ముందు ఉన్నదని అన్నారు. 'ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న ప్రధాన సమస్య వారి జీవన ప్రమాణాలు. గత పది సంవత్సరాల కాలంలో ఉపాధి స్థాయిల్లో మెరుగుదల లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక విధానాలే ఈ వినాశనానికి కారణం. ఆర్థిక వ్యవస్థనే కాదు... ప్రజల జీవితాలను కూడా ఇవి ధ్వంసం చేశాయి. ఉపాధి కూడా ప్రజల ముందు ప్రధాన సమస్యగా ఉంది. ప్రజల్లో మతపరమైన చీలికలు తేవడం, విద్వేషాల వ్యాప్తి చేయడం, విషపూరిత ప్రచారం ద్వారా ప్రజలను ప్రభావితం చేసేందుకు బిజెపి యత్నిస్తోంది. అయితే ఈ ట్రిక్కులు ఫలించబోవని' ఆయన అన్నారు.

**బిజెపి ఎందుకంత నిరాశ చెందుతోంది...?**

'బిజెపి నిరాశానిస్పృహలతో ఉంది కాబట్టే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో పార్టీలను చీల్చే పనికి తెగబడుతున్నది. ఇది, సిబిఐ, ఇతర కొన్ని సంస్థలను పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తున్నది. ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నది. 370 లేదా 400 స్థానాలకు పైగా గెలుచుకుంటామని ధీమాగా ఉన్న వారు ఎందుకిలా పార్టీలను చీల్చే పనిలోఉన్నారు? వారిని బెదిరించడం, భయపెట్టడం వంటివి చేయడం ద్వారా తమ పార్టీలోకి వచ్చేలా ఎందుకు చేసుకుంటున్నారు' అని ఏచూరి ప్రశ్నించారు.. ప్రతిపక్ష నేతలు తమ పార్టీలోకి రాగానే వారిపై ఉన్న కేసులన్నీ అటకెక్కుతాయని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్టీలో వారు చేరగానే వారిపై కేసులన్నీ మాయమైపోతాయి. బెదిరింపులకు లొంగకుండా, ఒత్తిడికి తలొగ్గకుండా దృఢంగా నిలిచిన వారిని జైలుకు పంపుతుంటారని అన్నారు.

**స్వేచ్ఛాయుత ఎన్నికలే ప్రధానం**

370 స్థానాలు గెలుచుకోవాలన్న బిజెపి లక్ష్యం గురించి ప్రశ్నించగా ఎన్నికలు ఎంత స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయన్న విషయంపై ఇది ఆధారపడి ఉంటుందని ఏచూరి తెలిపారు. 'ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయా లేదా అనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. ఎన్నికల బాండ్లు, పిఎం కేర్స్...ఇలా అన్నింటి నుండి వారికి కోట్లాది రూపాయలు వచ్చాయి. ప్రపంచంలోనే ఇవి అత్యంత ఖరీదైన ఎన్నికలు కాబోతున్నాయి. ఇవిఎంలపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. వీవీపాట్లు, ఇవిఎంలపై సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ఎన్నికల కమిషన్‌ను కలవాలని మా పార్టీ ప్రతినిధి బృందం భావించింది. అయితే విచారకరమైన విషయమేమంటే ఎన్నికల కమిషన్ మా అభ్యర్థనను అంగీకరించలేదు. ఇక్కడ అన్నీ ప్రశ్నలే. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడమంటే అందరికీ సమానావకాశాలు లభించడం. అయితే ఇక్కడ అలా లేదు. ఇవాళ కూడా ప్రభుత్వ విమానాలను దుర్వినియోగం చేస్తున్నారు. రాజకీయ సభలకు ప్రధానిని, ఇతర నాయకులను తీసికెళ్లడానికి సాయుధ దళాల హెలికాప్టర్లు వాడుతున్నారు' అని ఏచూరి విమర్శించారు..

ఎన్నికల సంఘం వీటిని ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలుగా భావించడం లేదని ఏచూరి విమర్శించారు. ఎన్నికల కమిషన్ ఎంత స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తుందన్నదానిపైనే అంతా ఆధారపడి ఉందని, అలా జరిగినప్పుడు బిజెపి ఊదరగొడుతున్న దానికి పూర్తి భిన్నంగా ఫలితాలు ఉంటాయని ఏచూరి నొక్కి చెప్పారు.

## ఐర్లాండ్ ప్రధాని రాజీనామా

**డబ్లిన్ :** ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఐర్లాండ్ ప్రధాని లియో వరాద్‌కర్ (45) బుధవారం ప్రకటించారు. తన వారసుడిని ఎన్నుకున్న అనంతరం తన రాజీనామా వుంటుందని తలెఇపారు. ఐర్లాండ్ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామి అయిన మధ్యే మితవాద పార్టీ ఫైన్ గేల్ పార్టీ చీఫ్‌గా తక్షణమే వైదొలగుతున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకత్వ పోటీ తర్వాత ప్రధాని పదవి నుండి వైదొలగనున్నారు. తన ఈ రాజీనామాకు వ్యక్తిగత, రాజకీయ కారణాలున్నాయని చెప్పారు. ఇప్పటికైతే తన భవిష్యత్ ప్రణాళికలు ఏవీ లేవన్నారు. పార్లమెంట్‌లో వెనుక బెంచీల్లో కూర్చునే ఎంపీగా కొనసాగుతానని తెలిపారు. లియో ఇప్పటికి రెండుసార్లు ప్రధాని బాధ్యతలు నిర్వర్తించారు. 2017-2020 మధ్య కాలంలో ఒకసారి, 2022 డిసెంబరు నుండి రెండోసారి ప్రధాని పదవిని చేపట్టారు. మొదటిసారి ప్రధాని పదవికి ఎన్నికైనపుడు లియో దేశంలోనే అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానిగా రికార్డు సృష్టించారు. అలాగే ఐర్లాండ్ మొదటి గే ప్రధాని కూడా, ఆయన ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించారు. లియో వరాద్‌కర్ తల్లి ఐరిష్ కాగా, తండ్రి భారతీయుడు. 2015లో స్వలింగ సంపర్కుల వివాహాన్ని చట్టబద్ధం చేయడంలో కీలక పాత్ర పోషించిన లియో గర్భస్రావంపై నిషేధాన్ని రద్దు చేశారు. దేశాన్ని మరింత సమానంగా, మరింత ఆధునికంగా రూపొందించగలిగానని గర్వంగా చెప్పుకుంటానని లియో తన రాజీనామా ప్రకటనలో వ్యాఖ్యానించారు. పార్టీలో తీవ్ర అసమ్మతిని లియో ఎదుర్కొంటున్నారు.

## నారాయణకు అస్వస్థత

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అస్వస్థతకు గురయ్యారు. ఈనెల 16న కామారెడ్డిలో జరిగిన ఓ వివాహానికి హాజరైన సందర్భంలో వేదిక ఎక్కుతూ ఆయన జారి కింద పడ్డారు. అనంతరం విశాఖపట్నం, చెన్నైలో నిర్వహించిన పార్టీ సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంలో నొప్పి ఎక్కువ కావడంతో డాక్టర్లను సంప్రదించారు. పక్కటెముక (రిబ్) విరిగినట్టు వారు నిర్ధారించి ఆయనకు రెండు వారాలపాటు విశ్రాంతి అవసరమని సూచించారు. ప్రస్తుతం నారాయణ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.








**మీ కోసం**


కూరలో పులుపు తక్కువైనట్లు అనిపిస్తే మామిడి పొడి, పెరుగు మిశ్రమాన్ని కలిపితే టమాట రుచి వస్తుంది.

**జీవన సౌరభం**

భయపడడం ఎప్పుడు మానేస్తామో.. అప్పుడే మన జీవితం మొదలవుతుంది.



# పదవికి పరీక్ష




అమరావతి నగరంలోని జమిందారు రాఘవయ్యకు తన వ్యాపార విషయాలు చూసుకునేందుకు నమ్మకమైన ఉద్యోగి అవసరం అయ్యాడు. ఉద్యోగం కోసం వచ్చిన వారందరినీ పరీక్షిస్తున్నారు. చివరికి రాముడు, సోముడు అనే యువకులు మిగిలారు. ఆ ఇద్దరిలో ఎవరు సరైనవాడో తేల్చాలని, ఇద్దరికీ చెరి ఐదు రూకలు ఇచ్చి 'భోజనం చేసి రమ్మ'ని చెప్పాడు జమిందారు.

భోజనం చేసి వచ్చిన రాముడు నాలుగు రూకలు జమిందారుకు అందించగా, సోముడు రెండు రూకలే తిరిగి ఇచ్చాడు. ఇంతలో ఓ యువకుడు వచ్చి 'నమస్కారం జమీందారు గారు, నేను రంగనాథం గారి కుమారుడ్ని. నాన్న గారు ఈ రెండు వేల వరహాలు తమకు ఇచ్చి రమ్మన్నారు' అని రెండు మూటలు ఇచ్చి వెళ్ళాడు. 'నాయనలారా.. మీరు చెరో వరహాల మూటతో చెరొక గదిలోకి వెళ్ళి లెక్కించుకు రండి' అన్నాడు జమిందారు. కొద్ది సేపటికి రాముడు వరహాల మూటను జమిందారుకు అందించి 'ఇందులో ఐదు వరహాలు అధికంగా ఉన్నాయి' అన్నాడు. అప్పుడే బయటికి వచ్చిన సోముడు 'ఇందులో వేయి వరహాలు సరిగానే ఉన్నాయి' అన్నాడు.

ఇద్దరిలో సరైన ఉద్యోగి ఎవరో జమీందారుకు తెలిసిపోయింది. ఆ విషయమే వాళ్లకి వివరంగా చెప్పాడు. 'నాయనా, సోముడు భోజనంలో నీ దుబారాతనం కనిపించింది. అలాగే మీకు ఇచ్చిన రెండు వరహాల మూటల్లో వెయ్యికి పైన ఐదు వరహాలు ఎక్కువ ఉండేలా ఏర్పాటు చేశాను. అంటే నీకు ఇచ్చిన వరహాల మూటలో ఐదు దొంగిలించావు. నీలో ధనం పొదుపు తెలియకపోవడం, దొంగతనం అనే అవలక్షణాలు ఉన్నాయి. కాబట్టి, నీవు ఈ పదవికి అనర్హుడివి. రాముడికే ఈ ఉద్యోగం ఇస్తున్నాను' అని జమిందారు ప్రకటించాడు.

**- బెల్లంకొండ నాగేశ్వరరావు, చెన్నయ్.**

## ఖాళీలు పూరించండి




పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలో కొన్ని జంతువుల తలలు ఉన్నాయి. వాటి ఆధారంగా ఆంగ్లంలో వాటి పేర్లను క్లూ ఆధారంగా రాయండి.

## నేను గీసిన బొమ్మ





- కె.ధనుష్, ఏడో తరగతి, ఎంపిహెచ్ఎస్, పెద్ద గొట్టి ముక్కల, మెదక్ జిల్లా.


**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**

**ఇంటినుండి తప్పిపోయిన లేక పారిపోయిన పిల్లల్లో ఇల్లు చేరేది చాలా తక్కువ మంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఈ తరహా సంఘటనలు కోకొల్లలు. అధికార యంత్రాంగం రాత్రింబవళ్లు పనిచేసినా ఫలితాలు అంతంతమాత్రమే! టెక్నాలజీ ఇంత అభివృద్ధి చెందిన ఈ కాలంలో కూడా పిల్లల ఆచూకీ కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారు. కానీ ఓ సాదాసీదా వ్యక్తి మాత్రం చాలా స్వల్ప కాలంలోనే పిల్లల ఆచూకీ తెలుసుకుంటున్నాడు. సొంత ఇళ్లకి చేర్చుతున్నాడు. మూడు దశాబ్దాలుగా ఇదే పనిపై అవిశ్రాంతంగా కృషి చేస్తున్న అతని పేరు రాజు నేపాలీ. అతనికి ఏ హోదా లేదు. అంతకుమించి డిగ్రీలు, పీజీలు చదవలేదు. కానీ తప్పిపోయిన పిల్లల ఆచూకీ తెలిసేంత వరకు నిద్రపోడు. పశ్చిమ బెంగాల్ దోర్స్ ప్రాంతంలో ఉంటాడు. ఆ ప్రాంతానికి అతనో హీరో. 'దోర్స్ ఎక్స్‌ప్రెస్ మెయిల్' పేరుతో అతను నడిపే స్వచ్ఛంద సంస్థ ఇప్పటి వరకు వెయ్యికి పైగా కుటుంబాల్లో సంతోషాలు నింపింది.**

# మీకు వీలైతే ఆపండి ..!



ఓ సాదాసీదా వ్యక్తి ఇంత పెద్ద బృహత్తర కార్యక్రమాన్ని నడిపించడానికి ఎంచుకున్న ఏకైక మార్గం సోషల్ మీడియా. వాట్సాప్ గ్రూపు సహాయంతో దేశ నలుమూలలకు తప్పిపోయిన పిల్లల వివరాలు షేర్ చేస్తుంది రాజు బృందం. సెకండ్ల వ్యవధిలో 230 మందికి ఆ వివరాలు పంపుతారు. వారిలో జర్నలిస్టులు, పోలీసులు, సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు ... ఇలా ప్రజలతో ఎప్పుడూ అనుసంధానంగా ఉండే వ్యక్తులు ఉన్నారు. కొన్ని వారాలపాటు ఆ గ్రూపులో ఈ వివరాలు షేర్ చేస్తుంటారు. ఈ నెట్‌వర్క్ ఎంత బలంగా ఉంటుందో చెప్పాలంటే, ఓ సంఘటన గురించి చెప్పుకోవాలి.


'స్టాప్ ఇఫ్ యు కెన్' గ్రూపులోని కొంతమంది సభ్యులతో రాజు..

**వారి సేవకు ఓ ఉదాహరణ..**

గతేడాది అక్టోబరులో సిక్కింకి చెందిన బిజోయ్ (పేరు మార్చబడింది) తన స్నేహితులతో కలసి వారాంతపు సెలవుల్లో పశ్చిమ బెంగాల్ సిలిగురికి విహారయాత్రకు వెళ్లాడు. యాత్ర ముగించుకుని మిత్రుల బృందం తిరిగి సిక్కిం చేరుకుంది. కానీ, 16 ఏళ్ల బిజోయ్ ఇల్లు చేరలేదు. కొడుకు ఇంటికి రాలేదని తెలియగానే అతని తండ్రి మొట్టమొదటగా రాజుకి ఫోన్ చేశాడు. ఆ ప్రాంతంలో ఏ పిల్లవాడు, ఏ పిల్ల కనిపించకుండా పోయినా మొదటి కాల్ రాజుకే వెళుతుంది.

ఫోను కాల్ అందుకున్న రాజు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సిక్కిం పోలీసులకు



సమాచారం అందించాడు. బిజోయ్ వివరాలను తన వాట్సాప్ గ్రూపులో షేర్ చేశాడు. వారం పాటు అతని బృందం బిజోయ్‌ని వెతికిపట్టుకునే పనిలో నిమగ్నమైంది. ఎట్టకేలకు ఓ డ్రగ్ ముఠా గుప్పెట్లో బిజోయ్ చిక్కుకున్న సంగతిని వారు గుర్తించారు. బిహార్‌లోని భగల్పూర్ ముఠా బిజోయ్‌ని పంపించాలంటే రూ. లక్ష డిమాండ్ చేశారు. ఆ ఫోన్ కాల్‌ని ట్రేసింగ్ చేసిన రాజు బృందం, పోలీసుల సాయంతో అక్కడికి వెళ్లి బిజోయ్‌ని రక్షించింది.

టెక్నాలజీని ఉపయోగించుకుని ఎంత కష్టమైన పనినైనా సులభంగా సాధించవచ్చు అంటాడు రాజు. అయితే ఇంత పెద్ద నెట్‌వర్క్‌ని 30 ఏళ్ల కిందటే రాజు ప్రారంభించారు. అసలు ఇదంతా ఎందుకు చేస్తున్నాడు? ఎవరు ప్రోద్బలం అతన్ని ముందుకు నడిపిస్తోంది? ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

**ఆమె సంతోషంగా ఉంటుందనుకున్నాను..**

'నేను ఏడవ తరగతితోనే చదువు మానేశాను. ఆర్థిక ఇబ్బందులు నన్ను అంతకుమించి చదవనివ్వలేదు. ఓ స్వచ్ఛంద సంస్థలో వాలంటీర్‌గా చేరాను. అందులో భాగంగా దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలు సందర్శించాను. 1992లో దేశం దాటి నేపాల్‌కి వెళ్లాను. అక్కడ నాకో అమ్మాయి పరిచయం అయ్యింది. నన్ను అన్నలాగా భావించేది. మేము చాలాకాలం కలిసి ఉన్నాం. ఎంతో అనుబంధం ఏర్పడింది. కొన్నేళ్లకు తన నుంచి నాకో ఉత్తరం అందింది. తన వివాహం నిశ్చయమైందని, తప్పకుండా రావాలని రాసింది. నేను పెళ్లికి వెళ్లాను. తను చాలా సంతోషంగా ఉంది. ఇంటికి తిరిగి వచ్చాక నేనెప్పుడూ ఆమె పెళ్లి గురించి ఆలోచించలేదు. ఆమె సుఖంగా ఉంటుందనే భావించాను. కానీ, ఒక ఏడాది తరువాత నేను వాళ్లింటికి వెళ్లాను. తన గురించి ఆరా తీశాను. నేను ఊహించని సంఘటన అక్కడ ఎదురైంది. పెళ్లయిన తరువాత నుండి ఆమెకు తన తల్లిదండ్రులకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. పెళ్లి కొడుకు ఎక్కడున్నాడో కూడా వాళ్లకి తెలియదు. అది విని నేను చాలా షాక్ అయ్యాను. ఆ క్షణం నాకు ఆ అమ్మాయి అమాయకమైన ముఖం, చిరునవ్వు గుర్తుకువచ్చి కన్నీళ్లు వచ్చాయి. ఎంతో ఆశగా వెళ్లిన నేను చాలా నిరాశగా వెనుదిరిగాను. తన గురించి పోలీసులకు ఫిర్యాదు చేయమని చెప్పి వచ్చేశాను' అంటూ గతాన్ని గుర్తుచేసుకున్నాడు రాజు.

**ఓ అమ్మాయి నా భుజం తట్టింది..**

ఆ సంఘటన జరిగిన 8 ఏళ్ల తరువాత రాజుకు ఓ చేదు సంఘటన ఎదురైంది. 'నేను మిషనరీ పని మీద పూణె వెళ్లాను. ఓ దాబాలో రాత్రి భోజనం చేసేందుకు కూర్చున్నాను. ఆహారం ఆర్డర్ పెట్టి ఎదురుచూస్తున్నాను. ఈలోపు నా భుజంపై ఓ చేయి పడింది. వెనక్కి తిరిగి చూశాను. ఓ మహిళ నన్ను అదేపనిగా చూస్తోంది. నేను ఆమెను గుర్తుపట్టలేదు. తన నిశ్చితార్థానికి నేను వచ్చానని, చిన్నప్పుడు కలిసి ఆడుకున్నామని పదే పదే నాకు గుర్తు చేస్తోంది. ఆ పాత సంగతులన్నీ ఆమె చెబుతుంటే నాకు దు:ఖం పొంగుకొచ్చింది. జీవితంలో తనను మళ్లీ చూస్తాను అనుకోలేదు. నా ఏడుపు చూసి తను కూడా బిగ్గరగా ఏడ్చేసింది. తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పింది. పెళ్లి చేసుకోగానే ఆ వరుడు తనను రెడ్‌లైట్ ఏరియాకి అమ్మేశాడు. అప్పటి నుండి తను సెక్స్ వర్కర్‌గా మారిపోయింది. రోజూ నరకయాతన పడుతున్నానని బోరున ఏడ్చింది. తనను తీసుకుని వాళ్లింటికి వెళ్లాను. కూతురుని చూసి వాళ్లు ఆనందిస్తారని అనుకున్నాను. కానీ వాళ్లు తనను ఇంట్లోకి రావద్దన్నారు. రెడ్‌లైట్ ఏరియాలో నివసించిన తను తమకు అక్కర్లేదని ఖరాఖండిగా చెప్పేశారు. ఈ హఠాత్ పరిణామానికి నా స్నేహితురాలు, నేను నిశ్చేష్టులమైపోయాం. తనను ఏదైనా సురక్షిత ప్రదేశంలో ఉంచుదామని చాలా ప్రాంతాలు వెతికాను. ఈ లోపే తనకు హెచ్ఐవి పాజిటివ్ అని తేలింది. రోజుల వ్యవధిలోనే తను ప్రాణాలు విడిచింది.

**అప్పుడే నిర్ణయించుకున్నాను..**

ఈ మొత్తం సంఘటనలో నాకు చాలా విషయాలు అర్థమయ్యాయి. మొట్టమొదటిసారి మానవ అక్రమ రవాణా గురించి విన్నాను. విచారణలో జాప్యం గురించి తెలిసింది. రెస్క్యూ చేసిన పిల్లలను తల్లిదండ్రులు అంగీకరించరని అర్థమైంది. కాబట్టి ఈ పనులన్నింటినీ నా భుజాలపై వేసుకున్నాను. తప్పిపోయిన పిల్లలను వెతికిపట్టుకోవడం, తల్లిదండ్రులకు అప్పగించడం, బాధితులకు, కుటుంబసభ్యులకు అవగాహన కల్పించడం విధిగా చేయాలని ఆ రోజే నిర్ణయించుకున్నాను' అంటున్న రాజ్ తన దృష్టికి వచ్చిన తప్పిపోయిన పిల్లల కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెడతాడు. పోలీసు కేసు ఫైల్ చేయించడం దగ్గర నుండి, వారిని వెతికి పట్టుకోవడం, అవగాహన కల్పించడం చేస్తున్నాడు. దేశంలోనే కాక, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లలో కూడా రాజు బృందం పనిచేస్తోంది.

'సాధారణంగా తప్పిపోయిన పిల్లలు ఇంటికి తిరిగివెళ్తామన్న ఆశ కోల్పోతారు. కానీ మా బృందం వారిని ఇళ్లకు చేర్చినప్పుడు సంతోషంతో వాళ్ల ముఖాలు వెలిగిపోతుంటాయి. ఆ ఆనందం చూసిన తరువాత నేను పడ్డ శ్రమ అంతా దూదిపింజలా ఎగిరిపోతుంది. ఆ క్షణం చిరునవ్వు చిందిస్తున్న నా స్నేహితురాలే వాళ్ల ముఖాల్లో కనిపిస్తుంది' అని చెబుతున్న రాజు నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూప్ పేరు 'స్టాప్ ఇఫ్ యు కెన్'(మీకు వీలైతే ఆపండి).

# 'ఆర్‌సి-16' ప్రారంభించారు..



రామ్ చరణ్, బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తోన్న 'ఆర్‌సి-16' ప్రాజెక్టును బుధవారం ప్రారంభించారు. మైత్రీ మూవీ మేకర్స్ సగర్వ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై వెంకట సతీష్ కిలారు భారీఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి, నిర్మాత అల్లు అరవింద్, బోనీ కపూర్, సుకుమార్, జాన్వీ కపూర్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ హాజరయ్యారు. ప్రస్తుతం రామ్ చరణ్‌తో 'గేమ్ చేంజర్' సినిమా చేస్తోన్న డైరెక్టర్ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఆయన సంగీతమే నా గురువు

ధనుష్ హీరోగా తెరకెక్కుతోన్న ఇళయరాజా బయోపిక్ బుధవారం ప్రారంభమైంది. అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వంలో వస్తోన్న ఈ చిత్రం నుండి తాజాగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ధనుష్, కమల్‌హాసన్ పాల్గొన్నారు. ఇళయరాజాతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'నీ ఆలోచనలే నీ భవిష్యత్తును నిర్ణయిస్తాయని ఎప్పుడూ చెబుతుంటా. చాలామంది ప్రతిరోజూ నిద్రపోయే ముందు ఇళయరాజా పాటలు వింటుంటారు. కానీ, నేను.. ఆయన బయోపిక్‌లో ఎలాగైనా నటించాలని ఆలోచిస్తూ నిద్రలేని రాత్రులు గడిపా. రజనీకాంత్, ఇళయరాజా అంటే నాకెంతో ఇష్టం. వాళ్లిద్దరి బయోపిక్స్‌లో నటించాలని కోరుకున్నా. అందులో ఓ కల ఇప్పుడు నెరవేరింది. అందుకు గర్వపడుతున్నా. ఇళయరాజాకు నేనొక భక్తుడిని. యాక్టింగ్‌లో నాకు గురువు ఆయన సంగీతం. ప్రతీ సీన్‌కు ముందు ఆయన మ్యూజిక్ వింటుంటా. ఎలా నటించాలో అదే నాకు నేర్పిస్తుంది" అని ధనుష్ చెప్పారు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా దీనిని అద్భుతంగా తీర్చిదిద్దాలని కమల్‌హాసన్ కోరారు. ఇళయరాజానే దీనికి సంగీత దర్శకుడిగా వ్యవహరించవచ్చని తెలుస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

## 'ప్రజాకవి కాళోజీ'కి ప్రతిష్టాత్మక అవార్డులు




డాక్టర్ ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో తెరకెక్కిన 'ప్రజాకవి కాళోజీ' చిత్రానికి విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయి. ఇండియన్ వరల్డ్ ఫిలిం ఫెస్టివల్ అవార్డు, 2024లో ఫీచర్ ఫిక్షన్ కేటగిరిలో స్పెషల్ జ్యూరీ అవార్డు, కోలీవుడ్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ 2023లో బెస్ట్ డైరెక్టర్, యాక్టర్ అవార్డులు.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 16వ జైపూర్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ 2024 (జెఐయఫ్‌యఫ్)లో బెస్ట్ ఫీచర్ డాక్యుమెంటరీ అవార్డు, ఢిల్లీ ఫిలిం ఫెస్టివల్ 2024లో (మార్చి 30న జరగనుంది) బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ అవార్డు, రాజస్థాన్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ 2024లో బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ రీజనల్ తెలుగు అవార్డు, కర్ణాటక ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ 2023లో బెస్ట్ డైరెక్టర్ అవార్డు, ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 2024లో బెస్ట్ బయోపిక్ అవార్డ్‌ను ఈ చిత్రం సొంతం చేసుకుంది. జైనీ క్రియేషన్స్ పతాకంపై, శ్రీమతి విజయలక్ష్మీ జైనీ ఈ చిత్రాన్ని నిర్మించారు.




## మే 3న 'ప్రసన్న వదనం'

సుహాస్ నటిస్తున్న తాజా ప్రాజెక్టు 'ప్రసన్న వదనం'. ఈ సినిమాకు అర్జున్ వైకే దర్శకత్వం వహిస్తున్నారు. పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. మే 3న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్రబృందం ప్రకటించింది. లిటిల్ థాట్స్ సినిమాస్, అర్హ మీడియా బ్యానర్‌పై జెఎస్.మణికంఠ, టిఆర్.ప్రసాద్ రెడ్డి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఫేస్ బ్లైండ్‌నెస్ అనే వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఒక సమస్య ఎదురవుతుంది. ఇక ఆ సమస్య నుంచి అతడు ఎలా బయటపడ్డాడు అనేది ఈ సినిమా స్టోరీ.

## మరోసారి విజయ్ సినిమాలో ...



విజయ్ తాజా చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (గోట్) చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. యంగ్ విజయ్‌కి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. తండ్రి పాత్రకు జోడీగా త్రిష చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది.

## ఆరంభ వేడుకలకు

# చెపాక్ స్టేడియం ముస్తాబు

- బాలీవుడ్ స్టార్స్ రాక..
- రేపటినుంచి ఐపిఎల్ సీజన్-17 టోర్నమెంట్


చెపాక్ స్టేడియం

**చెన్నై:** గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) ఆరంభ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు బిసిసిఐ ఏర్పాట్లు పూర్తి చేసింది. చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియం (చెపాక్)ను మిరుమిట్లు గొలిపే దీపకాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ వేడుకల్లో బాలీవుడ్ స్టార్స్ అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్‌తోపాటు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, సింగర్ సోనూ నిగమ్ ఆటపాటలతో సందడి చేయనున్నారు. 22న (శుక్రవారం) సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభోత్సవ వేడుకలు మొదలవుతాయి. డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరగనున్న తొలి మ్యాచ్‌కు ముందు ఈ వేడుకలు జరగనున్నాయి. ఆరంభ వేడుకలు ముగిసిన అనంతరం 7:30 గంటలకు మ్యాచ్ టాస్ వేస్తారు. రాత్రి 8 గంటలకు మ్యాచ్ మొదలవుతుంది.

**బెంగళూరు-చెన్నై మ్యాచ్‌పైనే అందరి దృష్టి**

మార్చి 22న బెంగళూరు-చెన్నై జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ ఏడాది సీజన్ ప్రారంభం కానుండగా.. శనివారం(23న) పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య మొహాలీ స్టేడియంలో, కోల్‌కత్తా నైట్‌రైడర్స్-సన్‌రైజర్స్ జట్ల మధ్య కోల్‌కతా వేదికగా మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక ఆదివారం(24న) రాజస్తాన్ రాయల్స్-లక్నో జెయింట్స్, గుజరాత్ టైటాన్స్-ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మరో మ్యాచ్ జరగనుంది. శుక్ర, శని, ఆదివారం కలిపి కేవలం మూడు రోజుల్లో ఐపిఎల్‌లో ఆడే 10జట్లు తమ తొలి లీగ్ మ్యాచ్‌లను ఆడనున్నాయి. లోక్‌సభ ఎన్నికలు ఈ కాలంలోనే జరగనుండడంతో బిసిసిఐ కేవలం 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే ఇప్పటివరకు విడుదల చేసింది. ఈసారి కూడా ఎన్నికలు ఏడు దశల్లో జరగనుండడంతో ఎన్నికలు పూర్తియిన రాష్ట్రాల్లో మిగిలిన మ్యాచ్‌లను నిర్వహించేందుకు బిసిసిఐ కసరత్తు చేస్తోంది.

**సన్‌రైజర్స్ రాత మారేనా..!**

గత రెండు సీజన్‌లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియాను వన్డే ప్రపంచకప్, డబ్ల్యూటీసీ ఛాంపియన్‌గా నిలిపిన పాట్ కమిన్స్‌ను వేలంలో ఏకంగా రూ.20.50 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. అలాగే గత సీజన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన మార్‌క్రమ్ స్థానంలో కమిన్స్‌ను కెప్టెన్‌గా నియమించింది. ఇక జట్టు కూర్పు పరంగా ట్రావిస్ హెడ్ బ్యాకప్‌గా ఉపయోగించుకున్నా... మార్‌క్రమ్, హెన్రిచ్ క్లాసెన్, వానిందు హసరంగలను తుది జట్టులోకి తీసుకోవాల్సి ఉంటుంది. హసరంగ అవసరం లేదని భావిస్తే కొన్ని మ్యాచ్‌ల్లో అతనికి బదులుగా ఫజల్‌హక్ ఫారూకీ లేదా మార్కో జాన్సెన్‌ను ఆడించే ఛాన్స్ ఉంది. ఏది ఏమైనా విదేశీ ఆటగాళ్లను ఆడించడంలో సన్‌రైజర్స్‌కు ఇబ్బందులు తప్పక పోవచ్చు. ఈ సీజన్‌లో ఆరెంజ్ ఆర్మీ తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఢీకొట్టనుంది. మార్చి 23న ఈడెన్ గార్డెన్స్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) ఆటగాళ్లు ధరించే జెర్సీని ట్విటర్(ఎక్స్)లో బుధవారం పోస్ట్ చేసింది. ఆ పోస్ట్‌లో మ్యాక్స్‌వెల్, సిరాజ్, డుప్లెసిస్, కోహ్లి గ్రీన్ జెర్సీని ధరించి ఉన్నారు.

## టాప్‌లోనే సూర్యకుమార్ ఐసిసి టి20 ర్యాంకింగ్స్

**లండన్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) విడుదల చేసిన తాజా టి20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ టాప్‌లోనే నిలిచాడు. ఐసిసి బుధవారం విడుదల చేసిన బ్యాటర్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ 861పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇది ముంబయి ఇండియన్స్‌కు ఊరటనిచ్చే అంశం. గత మూడు నెలలుగా టి20 క్రికెట్‌కు దూరంగా ఉన్నప్పటికీ సూర్యకుమార్ నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం. రెండోస్థానంలో ఇంగ్లండ్ సంచలనం ఫిల్ సాల్ట్(802పాయింట్లు) నిలిచాడు. టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 714పాయింట్లతో ఏకంగా 6వ స్థానానికి ఎగబాకాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ అనూహ్యంగా అగ్రస్థానానికి ఎగబాకాడు. తాజా ర్యాంకింగ్‌లో ఆదిల్ రషీద్ 726పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇక ఐర్లాండ్‌తో జరిగిన మూడు టి20ల సిరీస్‌ను ఆఫ్ఘనిస్తాన్ జట్టు 2-1తో చేజిక్కించుకోవడం కీలకపాత్ర పోషించిన రషీద్ ఖాన్ టాప్-10 బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. ఈ సిరీస్‌లో 25ఏళ్ల రషీద్ ఖాన్ 8వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. బౌలర్ల టాప్-10 జాబితాలో అక్షర్ పటేల్ 4వ, రవి బిష్ణోయ్ 6వ స్థానంలో నిలిచారు.

## ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా రిషబ్ పంత్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా రిషబ్ పంత్ ఎంపికయ్యాడు. కారు యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలపాలై రెండేళ్లుగా క్రికెట్‌కు దూరంగా ఉన్న రిషబ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ పగ్గాలు చేపట్టాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ మంగళవారం వెల్లడించింది. 'రిషబ్‌ను మళ్లీ మా కెప్టెన్‌గా స్వాగతిస్తున్నాం. నూతన అభిరుచి, శక్తి, ఉత్సాహంతో అతను మరోసారి మా జట్టును నడిపించడాన్ని చూడటానికి ఎదురుచూస్తున్నాను' అని ఫ్రాంచైజీ ఛైర్మన్ పార్త్ జిందాల్ తెలిపారు. ఫ్రాంచైజీ ఎక్స్ హ్యాండిల్ 'వెల్‌కమ్ బ్యాక్ కెప్టెన్ రిషబ్ పంత్' అంటూ పోస్ట్ చేసింది. అలాగే, ర్యూబిక్స్ క్యూబ్‌లతో పంత్ ముఖాన్ని తయారు చేసిన వీడియోను పోస్ట్ చేసింది. 2021లో తొలిసారిగా ఢిల్లీ పగ్గాలు చేపట్టిన పంత్.. 2022 డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో గతేడాది సీజన్‌కు దూరమైన విషయం తెలిసిందే. గత సీజన్‌లో డేవిడ్ వార్నర్ ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68